Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 12.01.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




## సమన్వయ లోపం...
# వైకాపాకు శాపం!



- ఎలక్షన్ మేనేజ్‌మెంట్ టీమ్ లేక 2014లో వెనుకబాటు
- నాలుగేళ్ళలోనూ భర్తీకాని ఆ లోటు

**2014** ఎన్నికల ప్రచారంలో జగన్ సభలకు జనం జాతర మాదిరిగా వచ్చారు. అంతకుముందు నిర్వహించిన ఓదార్పుయాత్రలకు పోటెత్తినట్లు వచ్చారు. అదే చంద్రబాబు సభలకు లారీలు, బస్సులు పెట్టి తోలినా జనం రాలేదు. అయినా కూడా ఆ ఎన్నికల్లో చంద్రబాబు గెలిచాడు... జగన్ ఓడిపోయాడు. ఎక్కడుంది వ్యత్యాసం? ఎక్కడ వచ్చింది ఈ లోపం?

(మిగతా 11వ పేజీలో)




## ఓను...
# వాళ్ళ కాలాన్ని వెనక్కి తిప్పారు..!

- 52 ఏళ్ళనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు
- వయసును మరచి మనసులు పంచుకున్నారు
- ఆనాటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు




సృష్టిలో ఏ బంధం గొప్పది? తల్లి బిడ్డల బంధమా? గురు శిష్యుల బంధమా? భగవంతుడి, భక్తుడు బంధమా? వీటిలో ఏ బంధంలోనైనా మనిషిలో తెలియని స్వార్థం కొంతైనా ఉంటుంది. నా బిడ్డ, నా తల్లి, నా ప్రియశిష్యుడు అనే భావం వుంటుంది. వీటన్నింటిని మించిన బలమైన బంధం, ఏ స్వార్థం తెలియని బంధం స్నేహబంధం. ఆ స్నేహబంధానికి కులం తెలియదు, మతం తెలియదు, పేద, ధనిక తేడా తెలియదు. స్నేహబంధానికి తెలిసిందల్లా స్నేహితుడిని అభిమానించడం, ప్రేమించడం, కష్టాలలో వెన్నంటి ఉండడమే! కుటుంబ బంధాలలో, రక్త సంబంధాలలో అన్నదమ్ములే విడిపోవచ్చు... కాని, స్నేహబంధం మనుషుల్ని, వారి మనసుల్ని ఎప్పుడూ కలిపే వుంచుతుంది. దూరతీరాలలో వున్నా, కొన్నేళ్ల పాటు ఒకరికొకరు దూరంగావున్నా, స్నేహితులను కలుసుకోవాలని మనసులో కలిగే ఓ చిన్న ఆశ ఎంతటి దూరంలో వుండే వారినైనా కలుపుతుంది.

(మిగతా 12వ పేజీలో)



# సినిమానూ వదలని సెగ

**అజ్ఞాతవాసి ఫ్లాప్‌తో పండుగ చేస్కుంటున్న వైకాపా అభిమానులు**

**ఒక సినిమా ఫ్లాప్ కావాలని ఒక వర్గం ప్రజలు కోరుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి**



నేనెందుకు పార్టీ పెట్టానో నాకే తెలియదు, నేనెందుకు ప్రచారం చేస్తున్నానో నాకే తెలియదు, ఎన్ని సీట్లకు పోటీ చేయాలో నాకే తెలియదు... అన్నంత అజ్ఞానంలో వున్న హీరో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, ఒక దశ దిశ నిర్దేశం లేకుండా రాజకీయపార్టీని స్థాపించిన వ్యక్తి. పార్టీని పెట్టి కూడా ఎన్నికల్లో పోటీ చేయని నాయకుడు పవన్ కళ్యాణ్. ఆయన ఎందుకు పార్టీ పెట్టాడన్నది ఆయనకు తెలియకపోయినా, ఈ నాలుగేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మాత్రం తెలిసిపోయింది. కేవలం చంద్రబాబు కోసమే ఆయన రాజకీయాలలోకి వచ్చాడు. రాజకీయ పార్టీ పెట్టాడు. తనకొక సొంత లక్ష్యం అన్నది లేకుండా, కేవలం చంద్రబాబును కాపాడడం కోసం ఆయన అప్పుడప్పుడూ ప్రజల మధ్యకు రావడం, ప్రభుత్వాన్ని వదిలేసి ప్రతిపక్షంపై విమర్శలు చేయడం వంటివి ఆయన మీద జుగుప్సా కలిగేలా చేసాయి. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వాళ్ళు మొన్నటివరకు పవన్‌ను శత్రువుగా భావించలేదు. ఆయనపై విమర్శలకు పాల్పడలేదు. కాని పవనే అనవసరంగా వైసిపి కేడర్‌ను రెచ్చగొట్టాడు. దీంతో పవన్ – వైసిపిల మధ్య రాజకీయ వైరం సినిమాకు కూడా పాకింది. పవర్‌స్టార్ నటించిన 'అజ్ఞాతవాసి' సినిమా ఈనెల 10న విడుదల కావడం తెలిసిందే! పవన్ కోసం కృతజ్ఞతగా చంద్రబాబు ప్రభుత్వం ఈ సినిమాను రోజుకు ఏడు షోలు ప్రదర్శించడానికి అనుమతినిచ్చింది. పవన్‌కు చంద్రబాబు ఈ విధంగా సహకరించాడు. అదే సమయంలో వైసిపి శ్రేణులు, వై.యస్. అభిమానులు అధికారికంగా కాకపోయినా అనధికారికంగా ఈ సినిమాను చూడకూడదని ఎవరిపాటికి వాళ్ళు బహిష్కరించారు. ఈ సినిమాను చూడకూడదనే సంకేతాలు ఒకరి నుండి ఒకరికి బాగానే పాకాయి. చాలామంది పవన్ వైఖరికి నిరసనగా ఈ సినిమాకు స్వీయనిషేధం విధించుకున్నారు. వై.యస్. అభిమానులైతే ఈ సినిమా అట్టర్ ఫ్లాప్ కావాలని, హిట్ అయితే పవన్‌కు కొమ్ములొస్తాయని భావించారు. ఆశించినట్లే ఈ సినిమా అట్టర్‌ఫ్లాప్ కావడం వైకాపా అభిమానులకు ఎనలేని ఆనందానిచ్చింది. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టాడు. ప్రభుత్వాన్ని ఏలాడు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏరోజూ ప్రజలు గాని, ఆయన రాజకీయ ప్రత్యర్థులు గాని ఆయన కుటుంబసభ్యుల సినిమాలను చూడకుండా వుండాలనుకోలేదు. రాజకీయాలను, కళలను వేరుగా చూసారు. ఎన్టీఆర్‌కు ఒక క్లారిటీ వుంది. ఆయన లక్ష్యం క్లియర్‌గా వుంది. ఇక్కడ పవన్‌కు అది లేదు. ఎవరి కోసమో పని చేస్తున్నట్లుగా ఆయన వ్యవహారశైలి ఉంటుండడం వల్లే రాజకీయాలలోనే కాదు, సినిమాలలో కూడా అటూ ఇటూ కాకుండా పోతున్నాడు.






## జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పల్లిపాడుకు ఏ-గ్రేడ్



ఏ-గ్రేడ్ సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్–2017లో జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలో ఉన్న పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్.సోనియా, సిహెచ్ అనూష, ఎస్‌కె షోమియా, జగదీష్, శ్రీకాంత్‌లు రూపొందించిన 'సేంద్రియ పదార్థాలతో మొక్కలను పెంచవచ్చు' అనే నమూనా ఏ–గ్రేడ్‌ను సాధించి జిల్లా పేరు నిలబెట్టింది. ఈ సైన్స్ ప్రాజెక్టుకు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసులు ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా తమ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణమూర్తి అభినందించారు.






# సంక్రాంతికి సొంతింటికి ఉపాపతి

పేదోడికైనా, పెద్దోడికైనా ఉప రాష్ట్రపతికైనా, ఉపసర్పంచ్‌కైనా, కలెక్టర్‌కైనా, కండక్టర్‌కైనా, పాలకుడికైనా, శ్రామికుడికైనా, రాజుకైనా, రైతుకైనా సంక్రాంతి పండుగ సొంత ఊర్లో, సొంత మనుషుల మధ్య చేసుకుంటే వచ్చే కిక్కు బయట ప్రాంతాల్లో ఇతరుల మధ్య చేసుకుంటే వస్తుందా? సొంత మనుషుల మధ్య పండుగ మజా గురించి బాగా తెలిసినవాడు కాబట్టే భారత ఉప రాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ప్రతి సంక్రాంతి పండక్కి సొంతూరుకు వస్తుంటారు. సంక్రాంతి పండుగ 3రోజులు ఆయనను ఢిల్లీలో వుంచాలని చెప్పి కట్టేసినా, ఆ కట్లు తెంపుకునైనా నెల్లూరొస్తాడు.

ఈ ఏడాదైతే ఉపరాష్ట్రపతి హోదాలో సొంతూరులో సొంతవారి మధ్య సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి మూడు రోజుల ముందే వచ్చాడు. 11వతేదీ ఉదయం తిరుపతి నుండి హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్నారు. నేరుగా టెక్కే మిట్టలోని తన మిత్రుడు, సీనియర్ సంఘ్ చాలకుడు పొన్నలూరు సీతారామిరెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడే మిత్రులతో కలిసి మధ్యాహ్నం భోజనం కానిచ్చారు. అక్కడ నుండి సర్దార్ వల్లభాయ్‌పటేల్ నగర్‌లోని తన ఇంటికి వెళ్లారు. ఆరోజు రాత్రికే వెంకటాచలం లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని, ట్రస్ట్ కార్యాలయాలను పరిశీలించి అక్కడే నిద్ర పోయారు. 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే వుంటారు. 16వ తేదీ ఉదయం 9.20 గంటలకు నెల్లూరు పోలీసుగ్రౌండ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో చెన్నైకి బయలుదేరి వెళతారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా దాదాపు వెయ్యిమంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అజీజ్ బ్రదర్స్‌పై కేసు





నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ అబ్దుల్ అజీజ్‌కు షాక్ తగిలింది. ఆయన పైన ఆయన తమ్ముడు, కార్పొరేటర్ జలీల్ మీద చెన్నైలో చీటింగ్ కేసు నమోదైంది. మేయర్ అజీజ్‌కు చెందిన స్టార్ ఆగ్రో కంపెనీలో వాటా కోసం తాము ఇచ్చిన 42కోట్ల రూపాయలను వారి ఖాతాల్లోకి మళ్ళించారంటూ చెన్నైకు చెందిన ప్రసాద్ జెంపెక్స్ అనే కంపెనీ చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు మొన్న డిసెంబర్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును పరిశీలించిన చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అజీజ్ సోదరులపై క్రైమ్ నెంబర్ 431-2017 అండర్ సెక్షన్ 406, 420, 506, రెడ్‌విత్ 120-బి ఐపిసి క్రింద కేసులు నమోదు చేసారు. అజీజ్ సోదరుల అరెస్ట్‌కు సహకరించాలంటూ చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నెల్లూరు ఎస్పీని మెయిల్ ద్వారా కోరారు. కాగా, ఈ కేసులో అరెస్ట్ నుండి తప్పించుకునేందుకు అజీజ్ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించాడు. ఈ వ్యవహారం జిల్లా తెలుగుదేశం పార్టీలో కలకలం రేపుతోంది.

# మహిళా సిబ్బందికి ఇబ్బంది లేకుండా చేస్తా!



పోలీసుశాఖలో పనిచేసే మహిళా సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ హామీ ఇచ్చారు. ఈనెల 10వ తేదీ నెల్లూరు పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన మహిళా పోలీసు ఆత్మీయ సదస్సులో పాల్గొన్న ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది అందరికీ టర్న్ ప్రకారం బందోబస్తు డ్యూటీలు కేటాయిస్తామని, ప్రతి పోలీసుస్టేషన్‌లో మరుగుదొడ్లు నిర్మిస్తామని, ఇతర ప్రాంతాల బందోబస్తుకు వెళ్ళే మహిళా సిబ్బందికి ఆయా ప్రాంతాలలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, ఆర్.ఐ చంద్రమోహన్, కెజెఎం చిరంజీవి, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాద్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తురకా శ్రీనివాసులు, మహిళా సభ్యులు పరమేశ్వరి, రాధమ్మ, ఏఓ సంపత్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎస్పీ అందరితో కలిసి అక్కడే భోజనం చేశారు.

# అమ్మ ఫర్నీచర్‌లో సంక్రాంతి డిస్కౌంట్ మేళా



నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులోని అమ్మ ఫర్నిచర్ మాల్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 11, 12, 13తేదీలలో డబుల్‌కాట్ మంచాలు, ఆఫీస్ ఫర్నిచర్, సోఫాలు, డైనింగ్ టేబుళ్ళు, కిడ్స్ ఫర్నీచర్ తదితర 2000లకు పైగా మోడల్స్‌పై డిస్కౌంట్ మేళాను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేతలు గడ్డం సుధాకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, సుజన్‌రెడ్డిలు తెలిపారు. అలాగే ఇటీవల మినీబైపాస్‌రోడ్డులోని జిపిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన అమ్మ ఫర్నీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పో-2018ను విజయవంతం చేసినందుకు జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలు పండుగ ఆఫర్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


# అపోలోలో యాంజియోప్లాస్టీ విజయవంతం



సమావేశంలో ప్రసంగిస్తున్న డా॥ విజయ్‌అమర్‌నాథ్‌రెడ్డి

నెల్లూరు అపోలో హాస్పిటల్లో నిర్వహించిన యాంజియో ప్లాస్టీ ఆపరేషన్ విజయవంతమైందని ప్రముఖ కార్డియాలజిస్ట్ విజయ్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 10న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రామ్మూర్తి(59) షుగర్, బిపితో పాటు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం తమ హాస్పిటల్లో చేరగా, ఇక్కడి వైద్యులు అతనికి యాంజియోగ్రామ్, తదితర వైద్యపరీక్షలు నిర్వహించి గుండె కుడివైపు రక్తనాళానికి సంబంధించిన బైపాస్ గ్రాఫ్ట్ పని చేయడం లేదని, గతంలో వేసిన స్టంట్‌కు పొరలు ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో రామ్మూర్తికి క్యాథ్‌ల్యాబ్‌లో బెలూన్ ద్వారా యాంజియోప్లాస్టీ చేసారని, దీనికి సంబంధించి స్టంట్‌బూస్ట్ టెక్నాలజీతో పాటు కటింగ్ బెలూన్ వంటి అత్యాధునిక వైద్య పరికరాలను ఉపయోగించామని వెల్లడించారు. రామ్మూర్తి పరిస్థితి మెరుగ్గాఉందని, ఆపరేషన్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా ఉచితంగా నిర్వహించామన్నారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, డాక్టర్ చైతన్య, శివ, డాక్టర్ దయాకర్ పాల్గొన్నారు.

## 23వ వర్ధంతి



జననం: 08-11-1930 మరణం: 18-01-1995

స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు

లాయర్

తెలుగు వారపత్రిక

మహనీయుని మహితాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది కుటుంబసభ్యులు

## 'ప్రభా'తం

# సవాల్ విసురుతున్న సైబర్ క్రైమ్

**దేశంలో డిజిటల్ లావాదేవీలు బాగా పెరుగుతున్న ప్రస్తుత దశలో, దేశంలో నానాటికీ సైబర్ నేరాలు పెరిగిపోతుండడం ఎంతో ఆందోళన కలిగించే విషయం. ఇంటర్నెట్ వేదికగా రకరకాల మోసాలకు, దుశ్చర్యలకు పాల్పడుతున్న సైబర్ దుండగులపై ప్రభుత్వాలు దృష్టిపెట్టి వారి ఆట కట్టించాలి. సైబర్ నేరగాళ్లను కఠినంగా శిక్షించాలి. ఆన్‌లైన్ లావాదేవీల విశ్వసనీయతకు గానీ, ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకుగానీ ఎలాంటి ముప్పు రాకుండా కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు గట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.**

పెద్దనోట్ల రద్దుతో దేశంలో కాలక్రమేణా డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న ప్రస్తుత దశలో, ఇదే అదనుగా భావిస్తున్న సైబర్ నేరగాళ్ళు పూర్తిస్థాయిలో విజృంభించి ఆన్‌లైన్ మోసాలు, చీటింగ్‌లతో ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తుండడం దేశవ్యాప్తంగా కలవరం కలిగిస్తోంది. ఒకవైపు నగదు రహిత చెల్లింపులకు కేంద్రం ప్రాధాన్యత ఇస్తుంటే, మరోవైపు సైబర్ దుండగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వైనం దేశప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ సైబర్ నేరాల విషయం ప్రస్తావనకు వచ్చింది. ప్రభుత్వం వెల్లడించిన అధికారిక సమాచారం ప్రకారమే చూసినా సైబర్ నేరాలు 6 శాతానికి పైగా పెరిగాయంటే, వీటి తీవ్రత ఎంతగా పెరుగుతోందో అర్థమవుతూనే ఉంది. అయినా, ఇది సాదాసీదా విషయం కాదు. ప్రభుత్వాలు వెంటనే కదలి ఈ నేరాలను నిలువరించి, నేరగాళ్ళ ఆటకట్టించాల్సి ఉంది. దేశంలో డిజిటల్ వ్యవస్థను పాదుకొల్పిన దశలో, అది ఆచరణలో ఎలాంటి వైఫల్యాలు చెందకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవడం కూడా ఎంతో అవసరం.

ఇంటర్‌నెట్ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో డిజిటల్ సాంకేతిక నైపుణ్యం కొత్తపుంతలు తొక్కడం హర్షదాయకమేకానీ, ఆన్‌లైన్ లావాదేవీల విశ్వసనీయతకు గానీ, వ్యక్తిగత సమాచార భద్రతకు గానీ, ఇప్పుడు గానీ-ఎప్పుడు గానీ, ఎక్కడా ఎలాంటి ముప్పు వాటిల్లకుండా సకల జాగ్రత్తలు తీసుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వాలదేనని వేరే చెప్పనక్కర లేదు. కనుక, ఆ దిశలో కేంద్రం సరైన నిర్ణయం తీసుకుని సైబర్ నేరాలను అణచివేయాలి. ఇప్పటికే, సైబర్ దుండగుల అరాచక ప్రవృత్తి ప్రపంచవ్యాప్తంగా కూడా ఆందోళన కలిగిస్తూనే ఉంది. గత ఏడాది సైబర్ నేరముఠా ఒకటి 'వాన్న క్రై' పేరుతో సైబర్ దాడులు చేయడమే కాక, దాదాపు 175 దేశాలనే గడగడ వణికించిన విషయం అందరికీ తెలిసిందే. విశ్వవ్యాప్తంగా సాంకేతిక విజ్ఞానం పెరిగిపోతున్నదని ప్రపంచ మానవాళి సంబరపడిపోతున్న వేళ, ఇదే అదనుగా దొంగచాటుగా సైబర్ నేరాలు పెరిగిపోతుండడం ఎంతైనా విచారకరం. సమాచారం ఎంతో భద్రంగా ఉందనుకుంటే, అది కాస్తా సైబర్‌చోరుల హస్తగతమవుతుండడం, తద్వారా లేనిపోని నష్టాలు, కష్టాలు కలుగుతుండడం అందరికీ వేదన కలిగించే విషయమే. బ్యాంకులకు సంబంధించిన సమాచారం, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల సమాచారం, వ్యక్తిగత సమాచారం..ఇలా ఏ సమాచారం కావాలన్నా సైబర్ చోరులు తమ హస్తలాఘవంతో తమ చేతికి చిక్కించుకోవడం జరుగుతోంది. అంతేకాక, ఎంతో కీలకమైన సంస్థల సమాచారాన్ని కూడా హ్యాకింగ్ చేసి నష్టాల పాలుచేయడం, ఆన్‌లైన్ దందాలు పెరిగిపోవడం, రకరకాల మోసాలతో అమాయకులకు కుచ్చుటోపీ పెట్టి నిలువు దోపిడీ చేస్తుండడం సైబర్ నేరగాళ్ళకు నిత్యకృత్యమైపోతోంది. డెబిట్ కార్డులు-క్రెడిట్ కార్డుల మోసాలు, ఆన్‌లైన్ మోసాలు చేస్తూ, జల్సాలు మరిగిన వేలాదిమంది దుండగులు సైబర్ నేరాలనే వృత్తిగా చేసుకుని అమాయకులను దోచుకుంటున్నారని, మనదేశంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడుతన్న వారెంతోమంది ఉన్నారని అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇంటర్నెట్‌ను వేదికగా చేసుకుని, తద్వారా అదేపనిగా మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ళ భరతం పట్టేదాకా ఈ దుస్థితి తొలగదు. కేంద్రం రంగంలోకి దిగి, సత్వరం ఈ సైబర్ నేరగాళ్ళను పటిష్టవంతమైన చర్యలతో నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందులోనూ, ఆధార్ సమాచార భద్రతపై సందేహాలు తలెత్తుతున్న వేళ, ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ అనుబంధ సంస్థ 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ-ఐడిఆర్‌బిటి విడుదల చేసిన ఒక నివేదిక మరింత ఆలోచనలు రేకెత్తిస్తోంది. సైబర్ నేరగాళ్ళకు, దేశం వెలుపల ఉన్న శత్రువులకు ఆధార్ ఒక లక్ష్యంగా మారగలదని, వారి చేతుల్లోకి ఆధార్ సమాచారం వెళితే ఆ తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల వ్యక్తిగత గోప్యతకు ఎంతో నష్టం కలుగుతుందన్నది ఆ నివేదిక సారాంశం. అనేక రకాల స్వల్పకాలిక, దీర్ఘకాలిక సవాళ్ళను ఆధార్ ఎదుర్కొంటోందని, బయోమెట్రిక్ సహా ఆధార్ సమాచారాన్ని భద్రంగా కాపాడడం, ఎవరుపడితే వారు ఆ సమాచారాన్ని పొందకుండా నిరోధించడం ఇప్పుడొక సవాల్‌గా పరిణమించింది.

బ్యాంకింగ్ సహా అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పథకాలకు బయోమెట్రిక్ విధానం విస్తరించిన నేపథ్యంలో దేశంలో తరచూ జరుగుతున్న సైబర్ దాడులు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయి. బయోమెట్రిక్ లేదా ఇతర ఆధార్ సమాచారం సంఘవిద్రోహశక్తుల చేతుల్లోకి వెళ్తే జరిగే నష్టం అంతా ఇంతా కాదని, అందువల్ల దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల బయోమెట్రిక్ సమా చారాన్ని అత్యంత భద్రంగా కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని ఆ నివేదిక స్పష్టం చేస్తోంది.

ఇంత కీలకమైన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం అలక్ష్యం చేయకుండా సైబర్ నేరాలను అరికట్టాల్సి ఉంది. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలతో పాటు, దేశభద్రత కోసం.. ప్రజల ప్రయోజనం కోసం చిత్తశుద్ధితో పనిచేసే సాంకేతిక నిపుణులతో కలసి సైబరాసురుల ఆట కట్టించేందుకు కార్యాచరణ పథకం రూపొందించాల్సి ఉంది. ఇంటర్నెట్‌లో ఎంతో ప్రావీణ్యమున్న లక్షలాదిమంది సాంకేతిక నిపుణులను రంగంలోకి దించి, ఆ సైబరాసురులకు అంతుచిక్కని విధంగా వ్యూహాలు రచించి, ప్రభుత్వ-ప్రజల సమాచారానికి రక్షణగోడగా నిలవాలి. సైబరాసురుల చేతికి సమాచారం చిక్కకుండా, దేశ-ప్రజల సమాచార భద్రతే ధ్యేయంగా అందరూ కృషి చేస్తే తప్ప ఈ సమస్య ఒక కొలిక్కి రాదు.

అవసరమైతే ఇతర దేశాల సాంకేతిక సహకారాన్ని కూడా తీసుకుని, ప్రపంచవ్యాప్తంగా సైబరాసురుల ఆగడాలను అరికట్టేందుకు బృహత్తరమైన ప్రణాళికను రూపొందించి అమలుచేయాలి. అప్పుడే మనకూ.. మన సమాచారానికి సరైన భద్రత.

# పెన్నాతీరంలో 17న వేడుకగా.. గొబ్బెమ్మల పండుగ

**- ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని నగర ఎమ్మెల్యే సూచన**



సమావేశంలో మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరంలోని పెన్నానది తీరంలో ఈ నెల 17వ తేదీన ఎంతో వేడుకగా గొబ్బెమ్మల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పండుగ సందర్భంగా ఈనెల 7న నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్ స్థానిక తిక్కన పార్కు వద్ద అధికారుల సమావేశం ఏర్పాటుచేసి తగు సూచనలు చేశారు. పండుగ రోజున భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు నిర్వహించాలన్నారు. ఈ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాల నుంచి దేవతా మూర్తులను తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్టిస్తారని, భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు కనుక అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సూచించారు. పోలీసు యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, పెన్నా నదిలో పారిశుద్ధ్యం లోపించకుండా కార్పొరేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేస్తుండాలని, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. భక్తులకు దైవ ప్రసాదాలను అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరునగరంలో ఎంతో శోభాయమానంగా జరిగే ఈ పండుగను జయప్రదం చేసేందుకు, అన్నిశాఖల అధికారులు సమన్వయంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, నాయకులు వందవాసి రంగ, వేలూరు మహేష్, కొణిదల సుధీర్, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, హంజాహుస్సేన్, మునీర్ సిద్ధిక్, పఠాన్ ఫయాజ్‌ఖాన్, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.ఉదయకుమార్, గంధం సుధీర్‌బాబు, వి.శ్రీనివాసులురెడ్డి, శివపురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## గుళ్ళను గబ్బు చేస్తున్నారు

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మీద క్రైస్తవ ముద్ర వేసారు. ఆయనను హిందూ వ్యతిరేకిగా చూపించారు. మరి ఈ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు చేస్తున్నదేమిటి? పుష్కరాల పేరుతో దోపిడీ సాగించాడు. ఇది అన్యాయం కాదా? విజయవాడలో దేవాలయాలను కూలగొట్టించాడు. బూట్లు వేసుకుని పూజలు చేస్తుంటాడు. ఇప్పుడు విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో వెలుగు చూసిన క్షుద్రపూజలు ఎవరి కోసం చేసినట్లు? హిందూ మతానికి అపచారం చేస్తున్నది చంద్రబాబే! హిందూ మత ఉద్ధారక సంస్థలు నోరు మెదపవేం?

జి.వెంగళరెడ్డి, ఎస్.ఆర్.పురం.

### సంసారాన్ని నిలబెట్టుకోలేని వాడు
## రాష్ట్రాన్నేం నడుపుతాడు

ఇంట గెలిచి రచ్చ గెలవమని చెప్పారు పెద్దలు. తన కాపురాన్నే నిలబెట్టుకోలేని పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చి రాష్ట్రాన్నేం నడపగలడు. ఒకటికి మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. ఆయన మైండ్ సెట్‌కు ముగ్గురులో ఒక్కరు కూడా సెట్ కాలేకపోయారు. అలాంటిది ఆరుకోట్ల మంది ఆంధ్రులకు అతని మైండ్ సెట్ సెట్ అవుతుందా? తన రాజకీయ ప్రయాణంపై ఆయనకే క్లారిటీ లేదు. అధికారమే లక్ష్యంగా ఎవరైనా పార్టీని స్థాపిస్తారు, ఆ దిశగా పోరాడతారు. పవన్‌కళ్యాణ్‌లో పోరాట దృక్పథమే లేదు. ఎంతసేపటికీ ప్రభుత్వాన్ని వదిలేసి ప్రతిపక్షం మీద పడి ఏడ్చే పవన్‌లాంటోళ్ళు రాజకీయాలకు పనికిరారు. తనకు ముఖ్యమంత్రి పదవిని నిర్వహించే అనుభవం లేదని, అన్ని సీట్లలో పోటీ చేసే సత్తా లేదని తన అశక్తతను తానే చెప్పుకుంటున్నాడు. అంటే చంద్రబాబు చెప్పిన సీట్లలో మాత్రమే పోటీ చేస్తాడన్నమాట? ఈ మాత్రం వెలగబెట్టడానికి పార్టీ ఎందుకు? దానికొక జెండా ఎందుకు? తెలుగుదేశంలోనే చేరితే చంద్రబాబే ఏదో ఒక పదవి ఇస్తాడుగా!

షేక్ నాగూర్, నెల్లూరు.

## ఇదేం దౌర్జన్యం

పులివెందులలో జరిగిన జన్మభూమి గ్రామ సభలో కడప ఎంపీ వై.యస్.అవినాష్‌రెడ్డి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరించిన తీరు అసమంజసంగా ఉంది. ఆ సభలో ఎంపీ అభ్యంతరకర వ్యాఖ్యలు కాని, ప్రభుత్వంపై విమర్శలు కాని చేయలేదు. పులివెందులకు నీళ్ళు తెచ్చేదానికి స్వర్గీయ వై.యస్.రాజశేఖరరెడ్డి చేసిన కృషి గురించి మాత్రమే చెప్పసాగారు. వై.యస్. పేరు వినగానే చంద్రబాబుకు అంత కలవరపాటెందుకో? ఎంపీ చెప్పిన మాటల్లో అబద్ధాలుంటే ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వాటిని ఖండించవచ్చు. వై.యస్. కంటే తాను చేసిన గొప్ప పనులేవో చెప్పుకుని ఉండొచ్చు. అంతే కాని ఒక ఎంపీ నోటి దగ్గర నుండి దౌర్జన్యంగా మైకు లాక్కోవడం ఏపాటి సంస్కారం.

– పోతుల శ్యాం, నెల్లూరు.



# దండగ... పండగ...

## • పక్షుల పేరుతో కోట్లు దుబారా

పర్యాటక అభివృద్ధి అంటే సంవత్సరంలో 365రోజులు జరగాల్సిన ప్రక్రియ. దానిని రెండుమూడు రోజులు జాతరగా మార్పు చేయడం సబబు కాదు. మూడురోజుల సంబడం కోసం మూడు కోట్లు తగలెయ్యడం కరెక్ట్ కాదు. ఆ నిధులనే పర్యాటక కేంద్రాల అభివృద్ధికి వెచ్చిస్తే సంవత్సరం పొడవునా పర్యాటకులు రావడానికి, ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది కదా?

2000 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఈ పండుగను ప్రారంభించారు. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ప్రతి సంవత్సరం ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ అయిపోయింది. పక్షుల పండుగ పేరుతో ఏటా కోట్లు తగలేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలంటూ సినిమా యాక్టర్లను తీసుకొస్తున్నారు. గత ఏడాది ఈ పండుగ రసాభసాగా మారింది. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోని వర్గపోరుకు ఈ పండుగ ఒక వేదికగా మారుతోంది. పక్షుల పండుగ పేరుతో మూడురోజులు హడావిడి చేసి పర్యాటకంగా మమ అనిపించడం, ఆ తర్వాత దానిని పట్టించుకోకపోవడం షరా మామూలైపోయింది.

సంవత్సరంలో మూణ్ణాళ్ళ ముచ్చటగా కాకుండా సంవత్సరం పొడవునా పర్యాటకులు వచ్చేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సివుంది. నేలపట్టు, పులికాట్ సరస్సులతో పాటు 180 కిలోమీటర్ల సువిశాల తీరప్రాంతాలు వున్న బీచ్‌లను, సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను, పెంచలకోన, ఉదయగిరి వంటి పర్వతకేంద్రాలను పర్యాటక అభివృద్ధికి నమూనాలుగా మార్చడంపై శ్రద్ధ చూపాలి.

## నెల్లూరుజిల్లా ప్రగతిలో...

## వై.యస్. మార్క్ తప్పితే...

# బాబు బ్రాండ్ ఏది?



*మొన్న కోడూరుపాటు జన్మభూమి గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలు కోటలు దాటాయి. గాల్లోనే మేడలు కట్టారు. 2019కల్లా దగదర్తి ఎయిర్‌పోర్టును పూర్తి చేస్తామన్నారు. కృష్ణపట్నంపోర్టులో సెజ్‌ను ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. నెల్లూరు నుండి చెన్నై దాకా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరించి జలరవాణాను అభివృద్ధి పరుస్తామన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా జిల్లాలో ఇంకో మూడు ఎయిర్‌పోర్టులను కూడా తీసుకొస్తామన్నారు.*


చంద్రబాబు జిల్లాకు ఇంకా వీటిని తీసుకొచ్చే పనిలోనే వున్నాడు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక 2014లో ఇవే డైలాగ్‌లు, 2015లోనూ ఇవే డైలాగ్‌లు... ఇప్పుడూ అవే వాగ్ధానాలు... ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తోంది. ఇక ఈ సంవత్సరం ఎన్నికల వాతావరణం వుంటుంది. పెద్దగా పనులేమీ జరగవు. ఈ పనులన్నీ చేయడానికి చంద్రబాబుకు ఈ నాలుగేళ్ళు సరిపోలేదా?

ఇప్పటికీ నెల్లూరుజిల్లా ప్రగతిపై వై.యస్. మార్క్ వుందే తప్ప తన బ్రాండ్ పడే విధంగా చంద్రబాబు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ జిల్లాను పారిశ్రామికంగా ముందుకు నడిపించడానికి ఒక కృష్ణపట్నం పోర్టు అయితేనేమీ, పవర్ ప్రాజెక్ట్‌లైతేనేమీ, శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు, చింతవరం సెజ్‌లైతేనేమీ... ఇవన్నీ కూడా వై.యస్. కృషి ఫలితమే! ఆయన ముఖ్యమంత్రిగా పని చేసింది గట్టిగా అయిదేళ్ళు. తన పాలనలో కేవలం రెండు మూడేళ్ళ కాలంలోనే నెల్లూరు జిల్లాలో ఇంతటి పారిశ్రామిక ప్రగతిని చూపించాడాయన!

మరి చంద్రబాబు సీఎంగా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి నాలుగేళ్ళు కావస్తుంది. జిల్లాకు కొత్తగా వచ్చిన పరిశ్రమ ఒక్కటీ లేదు. చంద్రబాబు ఇది సాధించి తెచ్చాడని చెప్పడానికి ఏదీ లేదు. కనీసం

(మిగతా 10వ పేజీలో)



డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి మహిళా డిగ్రీ కళాశాల

(స్థాపితము : 1997)

విక్రమ సింహపురి యూనివర్శిటీకి అనుబంధం, కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణము, దర్గామిట్ట, నెల్లూరు - 524 003. ఫోన్ : 0861- 2326461, సెల్ : 9052171442, 9704646196

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

మా ప్రత్యేకతలు :

* కేవలం మహిళల కోసమే స్థాపించబడి గత 20 సంవత్సరాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ.
* గత విద్యా సంవత్సరం యూనివర్శిటీ నిర్వహించిన పరీక్షలలో నెల్లూరు జిల్లాలోనే ఉత్తీర్ణతా శాతంలో ద్వితీయ స్థానం సాధించిన ఏకైక విద్యా సంస్థ.
* ఆహ్లాదకరమైన వాతావరణంలో మహిళలకు పూర్తి భద్రత కల్పిస్తున్న విద్యాసంస్థ.
* లాభాపేక్ష లేకుండా విలువలతో కూడిన విద్యనందిస్తున్న సేవా సంస్థ.
* ఉత్తమ అధ్యాపకులచే అత్యుత్తమ శిక్షణ
* సాహిత్య, సాంస్కృతిక, క్రీడారంగాలలో ప్రోత్సాహం
* క్యాంపస్ సెలక్షన్స్ కొరకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

అందుబాటులోని కోర్సులు : బిఎస్‌సి., బి.కాం

* బి.కాం - కంప్యూటర్ అప్లికేషన్స్
* బి.ఎస్‌సి : మాథ్‌మాటిక్స్ - స్టాటిస్టిక్స్ - కంప్యూటర్ సైన్స్
* బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - కెమిస్ట్రీ - కంప్యూటర్ అప్లికేషన్స్
* బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ
* బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - బయో - కెమిస్ట్రీ - కెమిస్ట్రీ
* బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ

వి.మృదుల M.Sc., - ప్రిన్సిపాల్.

జె.వి.రెడ్డి - సెక్రటరీ & కరస్పాండెంట్.

# నెల్లూరు కబుర్లు

## వివిపిల సేవలో పోలీసు

పాపం పోలీసులకు సంక్రాంతి పండుగ కూడా కుటుంబసభ్యులతో కలిసి సరదాగా జరుపుకునే అవకాశం రావడం లేదు. జిల్లాకు వస్తున్న వివిపిల బందోబస్తుతోనే వాళ్లకు తల వాచిపోతోంది. ఈ కొత్త సంవత్సరం మొదలైంది మొదలు నెల్లూరులో విఐపి పర్యటనలు ఎక్కువయ్యాయి. 6వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాడు, 8వ తేదీ ఆయన కొడుకు ఐ.టి మంత్రి నారా లోకేష్ కావలి పర్యటనకు వచ్చాడు. ఈ మధ్యలో మూడురోజుల పాటు సూళ్ళూరుపేటలో పక్షుల పండుగ.. మంత్రులు రాక... ప్రత్యేక బందోబస్తు... ఇక 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు నెల్లూరుజిల్లాలోనే ఉండబోతున్నారు. మధ్యలో తమిళనాడు గవర్నర్, పలువురు విఐపిలు కూడా నెల్లూరు రాబోతున్నారు. వీళ్ళ బందోబస్తుతో నెల్లూరు పోలీసులకు పండుగ కూడా లేనట్లే!

## సాయిదర్బార్‌లో ఉషమ్మ



ఉషమ్మను సత్కరిస్తున్న మందిర ఛైర్మెన్ మధుసూదనసాయి దంపతులు

భారతదేశ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు సతీమణి ఉషమ్మ ఇటీవల నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరానికి విచ్చేసి సాయినాథునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు ఉషమ్మకు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాలతో, వేదమంత్రోచ్ఛారణలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం జరిగిన సాయినామ సంకీర్తనలో ఆమె పాల్గొన్నారు. మందిర ఛైర్మెన్ మధుసూదనసాయి దంపతులు ఉషమ్మకు బాబా శేషవస్త్రాలు, శాలువా, పూలమాల, మెమెంటోలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి దర్బార్ సత్సంగ సేవాదళ్ సభ్యులు, వెంకయ్యానాయుడు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలోనే తొలిగా...

## నెల్లూరులో టీవీఎస్ పార్ట్స్‌మార్ట్!



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహాచారి

అన్ని కంపెనీల వాహనాల విడి భాగాలను ఒకేచోట అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటగా నెల్లూరు ఆటోనగర్‌లో 'టివిఎస్ పార్ట్స్‌మార్ట్' షోరూంను నెలకొల్పడం జరిగిందని టివిఎస్ పార్ట్స్ మార్ట్ స్పేర్‌పార్ట్స్ డివిజన్ హెడ్ నరసింహాచారి పేర్కొన్నారు. 8వ తేదీ రాత్రి నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లోని డిఎస్ఆర్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఆటోమొబైల్ టెక్నీషియన్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ళకుపైగా చరిత్ర వున్న టివిఎస్ కంపెనీ వాహనదారులకు నాణ్యమైన సేవలను అందించాలనే ఉద్దేశ్యంతోనే అన్ని కంపెనీల స్పేర్‌పార్ట్స్ ఒకేచోట లభ్యమయ్యేలా పార్ట్స్ మార్ట్‌లను నెలకొల్పుతోందన్నారు. తమిళనాడు, కేరళ, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలో టివిఎస్ పార్ట్స్‌మార్ట్‌లకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. టివిఎస్ స్మార్ట్‌మార్ట్‌ల ద్వారా టెక్నీషియన్స్‌కు కూడా ఎంతో సౌలభ్యముంటుంది. వారికి కావాల్సిన స్పేర్‌పార్ట్స్ కోసం వివిధ షాపులకు వెళ్ళాల్సిన అవసరం లేదు. తక్కువ ధరతో, నాణ్యతతో, గ్యారంటీతో ఆటో విడిభాగాలు పార్ట్స్‌మార్ట్‌లలో దొరుకుతాయని చెప్పారు. ఈ సందర్భంగా టివిఎస్ కంపెనీ ప్రస్థానాన్ని, మోటారు వాహనాల రంగంలో కంపెనీ సాధించిన పురోగతిని, టివిఎస్ స్పేర్ పార్ట్స్ పనితనాన్ని స్లైడ్స్ షో ద్వారా వివరించారు. టివిఎస్ పార్ట్స్ మార్ట్ సీనియర్ మేనేజర్ గోవిందరాజన్ టివిఎస్ లూబ్రికెంట్స్‌ను గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో టివిఎస్ పార్ట్స్‌మార్ట్ నెల్లూరు షోరూం అధినేతలు చోడవరం సురేష్, యర్రం హనుమారెడ్డి, దాదాపు 200మంది టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

# క్రీడలతో మంచి వ్యక్తిత్వం.. ఆత్మవిశ్వాసం

### - మంత్రి సోమిరెడ్డి



5కె రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు నారాయణ, సోమిరెడ్డి

క్రీడలు మానసికోల్లాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడల ప్రాధాన్యతను గుర్తించి జన్మభూమి మార్గదర్శక సూత్రాల్లో క్రీడలను, సాంస్కృతిక కార్యక్రమాలను గుర్తించి వాటిని పొందుపరిచారన్నారు. జన్మభూమి పథకంలో భాగంగా ఈ నెల 7న మంత్రి సోమిరెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పి.నారాయణతో కలసి నగరంలోని ఏబిఎం మైదానంలో జన్మభూమి 5కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఆదివారం 'హ్యాపీ సన్‌డే' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మనలోని మానసిక వత్తిడిని బాగా తగ్గిస్తాయని, మనసులు ఆహ్లాదభరితంగా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో మంత్రులు సోమిరెడ్డి, నారాయణలతో పాటు సుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వరసుందరం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య, డిఎస్పీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బైక్ విజేత మాధవ్




విజేతకు బైక్‌ను అందజేస్తున్న శ్రీమతి టి.అనూరాధ, మావూరు వాసు, రాజీ యాడ్స్ పెంచలయ్య

సిఎంఆర్ చందన అమేటింగ్ సేల్ వీక్లీ డ్రా హీరో బైక్ నాల్గవ వారం డ్రా విజేతగా యు.మాధవ్ నిలిచాడు. టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ ఈ నెల 9న ఈ డ్రాను తీసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎంఆర్ చందన షాపింగ్ మాల్ నెల్లూరీయులకు ప్రధానంగా మహిళలకు ఒక వరమన్నారు. నాణ్యమైన వస్త్రాలను, మేలిమి బంగారు ఆభరణాలను తక్కువ ధరకు వేలాది వెరైటీలతో అందిస్తున్నారన్నారు. పండుగల సందర్భంగా ఖరీదైన కార్లు, మోటార్‌బైక్‌లు, గృహోపకరణాలు బహుమతులుగా అందజేయడం ఆనందదాయకమన్నారు. సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా బంగారు ఆభరణాలపై మూడు శాతం తరుగు తగ్గిస్తున్నామన్నారు. వస్త్రాలపై 50శాతం డిస్కౌంట్‌లు ఉన్నాయన్నారు.

రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, నెల్లూరు హెచ్‌డిసి సభ్యురాలు బి.వి.లక్ష్మి, మేనేజర్ వాసు, శైలేష్ పాల్గొన్నారు.

## పోలీసులకు గుడ్‌సర్వీస్ ఎంట్రీ రివార్డులు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుజిల్లా పర్యటన విజయవంతం కావడంతో జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ గుడ్‌సర్వీస్ ఎంట్రీ(జిఎస్ఇ) రివార్డులు ఈ నెల 6న ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో ముందుందు రాణించాలి అంటూ కొనియాడారు. సిఎం జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు నిర్వహించిన బందోబస్తు విషయంపై ఎస్పీ పోలీసులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసారని పోలీసులకు కితాబిచ్చారు. పర్యటన ముగిసిన అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన ముఖాముఖి నిర్వహించారు. జిల్లా పోలీసు యంత్రాంగం పనితీరులో మార్పులు వచ్చాయని, సిఎం పర్యటన విజయవంతం చేయడంలో ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహణపై సిఎం సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించారని ఎస్పీ తెలిపారు.

## ఆకట్టుకున్న ఫ్లెమింగో కవితోత్సవమ్



చిన్ని నారాయణరావును సత్కరిస్తున్న జేసీ ఏఎండి ఇంతియాజ్

'ఫ్లెమింగో ఫెస్టివల్' రాష్ట్ర ప్రభుత్వ పండుగ సందర్భంగా ఈ నెల 4వ తేదీన నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో 'కవితోత్సవమ్' జరిగింది. దాదాపు 25మంది కవులు పక్షులపైన పక్షుల పండుగపైన తమ కవితా బాణాలను సంధించారు.

ఈ కవితోత్సవాన్ని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్ జ్యోతి ప్రకాశనం గావించి ప్రారంభించారు. ఆర్థిక శాస్త్ర నిపుణులు, సాహితీవేత్త అయిన ఇంతియాజ్ ఈ కవితోత్సవంలో పక్షులపై తమ స్వీయ కవితను వినిపించడం విశేషం. ఆ కవిత సభికుల్ని విశేషంగా ఆకట్టుకొంది.

ఈ సందర్భంగా ఈ కవితోత్సవానికి ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించి కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్, చిన్ని నారాయణరావును సత్కరించారు.

ఆచార్య ఆదిత్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఈదూరు సుధాకర్, ఏటూరి నాగేంద్రరావు, బొగ్గరపు రాధా కృష్ణమూర్తి, శ్రీమతి పాతూరి అన్నపూర్ణ, సుభద్రాదేవి తదితర కవులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలే ఇస్తూ...



నాయకులు, అధికారులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

# చంద్రబాబు ఆ విధంగా ముందుకెళ్లారు



స్వయంసహాయక సభ్యులకు వంద కోట్ల పంతొమ్మిది లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా నెల్లూరు నగరంలో రూరల్ గ్రామాలలో ఈ నెల 6వ తేదీన సగం స్కూళ్ళకు సెలవులిచ్చారు. జిల్లా విద్యాశాఖధికారులు అధికారికంగానే ఈ సెలవు ప్రకటించారు. దీనికి కారణం ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరుజిల్లా పర్యటనకు వస్తుండడమే. చంద్రబాబు పర్యటనకు విద్యార్థులకు సంబంధమేంటి అనుకునేరు? స్కూళ్లకు సెలవిచ్చి పిల్లలను ఇళ్లకు పంపలేదు. స్కూల్ బస్సులెక్కించి కోదూరు పాడులో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి – మా ఊరు సభకు పంపారు.

ఈ నెల 6వ తేదీన నెల్లూరురూరల్ కోడూరుపాడులో జరిగిన జన్మభూమి–మా ఊరు గ్రామసభకు స్కూల్ పిల్లలను, పొదుపు సంఘాల మహిళలను, వివిధ పథకాల లబ్దిదారులను బాగానే తరలించారు. ఇక నెల్లూరురూరల్, సర్వేపల్లి నియోజకవర్గాల నుండి జనసమీకరణ చేశారు. ఈ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏకధాటిగా దాదాపు రెండు గంటల సేపు మాట్లాడి సభికుల సహనానికి అగ్నిపరీక్ష పెట్టారు. గతంలో ఇచ్చిన హామీలకు మరికొన్నింటిని మిక్స్ చేస్తూ జిల్లాకు కొన్ని వరాలు ప్రకటించారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్, కోస్టల్ కారిడార్, కృష్ణపట్నంపోర్ట్ సెజ్ అభివృద్ధి, బకింగ్‌హోం కెనాల్ పునరుద్ధరణ వంటి వాటిపై మాట్లాడారు. ఇక తన పరిపాలనలో ఏమేం చేసారో చెప్పుకుంటూ తన ప్రసంగంలో రెండు గంటల పాటు ముందుకెళ్లారు. సభకు రావడానికి ముందు చంద్రబాబు ఇక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ, జెన్‌కో, ఇఫ్‌కో, కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటి, డిఆర్‌డిఏ, ఆత్మగౌరవం దీక్ష, గమేషా కంపెనీల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం వద్ద సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అందరినీ అలరించాయి.

ఈ కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పి.నారాయణ, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, బొల్లినేని రామారావు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీమంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీఎమ్మెల్యేలు బీద మస్తాన్ రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, జడ్పీ ఫ్లోర్‌లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల జీవితాలను నాశనం చేయొద్దు

## - ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



ప్రజాబాటలో వృద్ధురాలితో కలిసి నడుస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పేదల ఇళ్ళను అక్రమంగా తొలగించి వారి జీవితాలను నాశనం చేయొద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 105 రోజుల ప్రజాబాటలో భాగంగా ఎమ్మెల్యే 101వ రోజు 18వ డివిజన్‌లోని సర్వేపల్లి కలువకట్ట, వెంకటరెడ్డి నగర్, రాజీవ్‌గాంధీ కాలనీల్లో ప్రజాబాట కొనసాగించారు. ఇంటింటికి వెళ్ళి అందరినీ పేరుపేరున పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాలువల ఆక్రమణల తొలగింపు న్యాయబద్ధంగా చేపట్టాలన్నారు. నీటిపారుదలకు ఇబ్బందిగా ఉన్న చోట, పేదవారికి ప్రత్యామ్నాయ ఇళ్ళను కేటాయించాకనే తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కాలువలలో నీటిపారుదలకి అడ్డంగా లేకుండా కాలువల గట్ల మీద కొన్ని వేల కుటుంబాలు గత యాభైఏళ్ళుగా కాపురాలుంటున్నాయని, వారికి విద్యుత్‌మీటర్లు, కుళాయి కనెక్షన్లు ప్రభుత్వాలే ఇచ్చాయని, ఇంటి పన్నులు కూడా వేశారని, సిమెంటురోడ్లు వేశారని, ఇప్పుడు అలాంటి ప్రాంతాలను ఆక్రమణల పేరుతో తొలగించి ఆ పేదలను కట్టుబట్టలతో నిరాశ్రయులను చేయొద్దని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. నీటిపారుదలకి నిజంగా ఇబ్బంది ఉన్న చోట, అక్కడ కాపురం ఉంటున్న పేదలకు ప్రత్యామ్నాయ ఇళ్ళ సౌకర్యం కలిగించాలని ఈ సందర్భంగా ఆయన మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టాలని, పూర్తిస్థాయిలో పరిశీలించి చేసినట్లయితే వరద సమస్యకి, ముంపు సమస్యకి పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని సూచించారు. బాధిత పేద కుటుంబాలకు స్థానిక ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా న్యాయం చేసేందుకు తాను పూర్తిస్థాయిలో అండగా ఉండి వారి తరఫున పోరాడుతానని ఎమ్మెల్యే కోటంరెడ్డి స్పష్టం చేశారు.




స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు

W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జననం: 1938 మరణం: 15-01-2014

మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి

మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన

శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖామాత్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు - మనుమరాండ్రు | | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | లక్ష్మీఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | కీర్తి | | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ | | |

# విజ్ఞానంలోనే విజయముంది!

## - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



విఎస్‌యు నూతన భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం అభివృద్ధికి 50కోట్ల రూపాయలు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ నెల 6వ తేది మధ్యాహ్నం ముఖ్యమంత్రి నెల్లూరు పర్యటన సందర్భంగా వెంకటాచలం మండలం, కాకుటూరులో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 26.1 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన భవన సముదాయానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏ దేశంలోనైనా సంపద ఎంత ఉన్నది అనేది ముఖ్యం కాదని, ఎంత విజ్ఞానం ఉన్నదనేదే ముఖ్యమన్నారు. ఎంతోకాలం నుంచి జిల్లా అభివృద్ధిలో ఉందని, అన్ని సౌకర్యాలతో పాటు పెన్నా, సంగం బ్యారేజీలకు నీళ్ళు వచ్చాయన్నారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో అత్యధిక ఆదాయం కలిగినవారు మన తెలుగువారే ఉన్నారన్నారు. చదువు ద్వారానే ఎంతైనా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎక్కడ జ్ఞానం ఉంటే అక్కడ అభివృద్ధి ఉంటుందన్నారు. మన విద్యా విధానాల్లో బాగా మార్పులు రావాలన్నారు. తాను విదేశాల్లోని యూనివర్శిటీలను సందర్శించినప్పుడు అక్కడ విద్యార్థులు నాలుగు నెలలు క్లాస్‌రూంలో ఉంటే మిగతా నెలలు క్షేత్రస్థాయిలో ఉండి పరిజ్ఞానం పెంపొందించుకుంటున్నారని, ఆంధ్రప్రదేశ్ ఒక నాలెడ్జ్ హబ్‌గా తయారుకావాలని ఆకాక్షించారు. పాత కోర్సులకు కొత్త ఓరియంటేషన్ జరగాలన్నారు. వినూత్నమైన పద్ధతుల ద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్‌టిజి పరిష్కారవేదిక వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఇంట్లో కూర్చుని ఆధునిక టెక్నాలజీ ద్వారా అర్జీలు తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ వంటి ఏ కోర్సుల్లో విద్య నభ్యసించేవారికైనా ఐ.టి రంగంలో ప్రవేశం ఉండాలన్నారు. అమేజాన్, గూగుల్ వంటి యాప్‌ల ద్వారా ప్రపంచం ముందుకు పోతుందన్నారు. త్వరలో రాష్ట్రానికి సోలార్, విండ్ ఎనర్జీలు వస్తాయని, తద్వారా విద్యుత్ రేట్లు తగ్గుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి మేధోశక్తిని ఉపయోగించి కొత్త పరిశోధనల ద్వారా పేదలకు సహాయపడాలన్నారు. త్వరలో రాష్ట్రంలో 5 కె రన్ ప్రవేశపెడతామన్నారు. యూనివర్శిటీల్లో విభిన్నమైన కోర్సులు వస్తున్నాయని, ఆక్వా కల్చర్, ఆటోమొబైల్, బోట్స్ బిల్డింగ్ వంటి కోర్సులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. సీ-కార్గోలో గుజరాత్ తర్వాత మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. విద్యారంగంలో దేశంలోనే మన రాష్ట్రం నెంబర్ 1గా ఉండాలన్నదే తన లక్ష్యమన్నారు.

తొలుత ముఖ్యమంత్రి విద్యార్థినీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య, రాజధాని కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు, కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మాజీమంత్రి పరసా రత్నం, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవ కోసమే వాగ్దేవి ఛారిటబుల్ ట్రస్ట్




సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు

నెల్లూరు వి.ఆర్ హైస్కూల్‌లో 1989 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇటీవల ఆత్మీయసమావేశం నిర్వహించారు. 1989 బ్యాచ్‌లో 110 మంది విద్యార్థులు చదవగా 80మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. అప్పటి హెడ్‌మాస్టర్ నరశింహారెడ్డితో పాటు ఇతర ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఒట్టూరు సంపత్‌రాజు, డాక్టర్ ఎంఎవివి ప్రసాద్, వి.వేణుగోపాల్‌రావు, డి.సురేంద్రనాథ్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, కిషోర్ తదితరులు మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థులంతా కలసి వాగ్దేవి ఛారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించామన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తామన్నారు. పాఠశాల పూర్వవిద్యార్థి కె.మల్లిఖార్జున మాట్లాడుతూ ఈ పాఠశాలలో 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న మెరిట్ విద్యార్థులకు ప్రతి ఏడాది పదిమందికి రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు. వి.ఆర్ హైస్కూల్ సమగ్ర చరిత్రను సేకరించి మూడు నెలల్లో వికిపీడియాలో ఉంచుతామన్నారు.

# పేదబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నెల్లూరు టివిఎస్ కళ్యాణసదన్ ఆధ్వర్యంలో ప్రతిభగల పేద బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు కళ్యాణసదన్ మేనేజింగ్ ట్రస్టీ పీఎస్సార్‌కే మూర్తి ఈ నెల 6న ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఆపైన చదువుతున్న విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా టివిఎస్ కళ్యాణసదన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పత్రాలను ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిభగల బ్రాహ్మణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## రోటరీ కల్చరల్ ఫెస్టివల్




జ్యోతిని వెలిగిస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి

ప్రతి విద్యార్థికి చదువులో మార్కులు, ర్యాంకులు ఎంత ముఖ్యమో వ్యక్తిత్వ వికాశం కూడా అంతే ముఖ్యమని గూడూరు పట్టణానికి చెందిన డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా రోటరీ కల్చరల్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమాన్ని ఈనెల 6వతేదీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పసుపులేటి మునిరాజా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంగీతం, సాహిత్యం, నాట్యం తదితర రంగాల్లో అభిరుచి పెంచుకొని ఉత్సాహంగా రాణించాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సంగీత నృత్యపోటీలలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు గూడూరు డిఎస్పీ వి.ఎస్.రాంబాబు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఎల్ఏపి కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, రొటేరియన్ దశరథరామిరెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభారెడ్డి, రఘురామిరెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి బాల కృష్ణంరాజు, రోటరీ ప్రతినిధులు కె.మునిగిరీష్, శ్రీకాంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, నాగేంద్రప్రసాద్, మైథిలి హాస్పిటల్ ఎం.డి రమణబాబు, డాక్టర్ మైథిలి, కె.సుందరరామిరెడ్డి, జానకి రామిరెడ్డి, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు బహుమతులందజేస్తున్న డిఎస్పీ రాంబాబు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి

పేదప్రజల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలన్నదే జన్మభూమి ఉద్దేశ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు మండలం నెల్లటూరు గ్రామంలో ఎంపిడివో కరిముల్లా ఆధ్వర్యంలో సర్పంచి మొండెం బుజ్జమ్మ అధ్యక్షతన ఈనెల 7వతేదీ జన్మభూమి - మా ఊరు ప్రతిజ్ఞను అందరూ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు మండల మాజీఉపాధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు. భారీ పూల మాలతో సన్మానించారు. అనంతరం గ్రామంలో ఎస్టీ, బీసీ కాలనీల్లో వేసిన సి.సి.రోడ్లను, అనంతరం పాఠశాల నూతన భవనాలను, కొత్తగా మంజూరైన చంద్రన్న రైతురథం ట్రాక్టర్లను రైతులకు పంపిణీ చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలను సంప్రదాయబద్ధంగా చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ శైలకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు పద్మ, వైస్ ఎంపీపీ శ్రావణి, ఏవో నాగమోహన్, హౌసింగ్ ఈఈ అమరనాథ్‌రెడ్డి, డిఇ జగదీశ్వరి, ఏఇ చంద్రశేఖర్‌రాజు, నాయకులు వెంటేశ్వర్లు రాజు, సోమిశెట్టి చెంచురామయ్య, వెంకట కృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగరాజు, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాధిక, వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

# లోకేష్‌చే పంచాయతీరాజ్ క్యాలండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, పంచాయతీరాజ్ శాఖామంత్రి నారా లోకేష్‌ను కలసి నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఇటీవల అమరావతిలో వున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేష్‌కు రియాజ్ అహ్మద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ డిప్లొమా ఇంజనీర్ల సమస్యలు ఏవైనా ఉంటే అన్నింటిని పరిష్కరించి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.హనుమంతరావు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్, రియాజ్ అహ్మద్

# 'కిమ్'కు మద్దతు పలికిన మోడీ

అది ఉత్తరకొరియా రాజధాని పోగ్యాంగ్ నగరం. అధ్యక్ష భవనంలోని తన గదిలో కూర్చుని ఆ దేశ అధ్యక్షుడు కిమ్ ఎన్‌డి టి.వి ఛానెల్ చూస్తున్నాడు. న్యూస్ బులెటిన్‌లో న్యూస్‌రీడర్ వార్తలు చదువుతుంది. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ చర్యలను సమర్ధించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ... ఉత్తరకొరియాపై అమెరికా దాడికి పాల్పడితే తాము ఉత్తరకొరియాకు అండగా నిలుస్తామని ప్రకటించిన మోడీ... కిమ్ ఎంతో సంయమనం, శాంతి, సహనం పాటిస్తున్నా ఆయనపై ట్రంప్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డ మోడీ... టీవీలో ఈ వార్తలు చూస్తున్న కిమ్‌కు తెగ ఆశ్చర్యమేసింది. ఆ తర్వాత ఆనందమేసింది. ఇంతవరకు ప్రపంచంలో తనని తిడుతున్న వాళ్ళు తప్పితే సమర్ధించిన వాళ్ళు లేరు, కాని మొదటిసారిగా ఒక గొప్ప దేశం నుండి మద్దతు లభించిందని సంబరపడ్డాడు. వెంటనే మోడీకి ఫోన్ చేసాడు. ఢిల్లీలో వున్న మోడీ ఫోన్ ఎత్తగానే... కిమ్ ఆయనకు కృతజ్ఞతలు చెబుతూ... మీలాంటి నాయకుడు మాకు మద్దతుగా నిలిస్తే ఒక్క అమెరికా మీదేం ఖర్మ, ప్రపంచం మొత్తం నెత్తిన అణుబాంబులు కురిపిస్తానని చెప్పాడు. దానికి మోడీ... మీలాంటి డేరింగ్, డాషింగ్ అధ్యక్షుడి సపోర్ట్ వుంటే మేము ప్రపంచాన్నే శాసిస్తామన్నాడు. ఏదేమైనా అనుకోకుండా మీలాంటి మిత్రుడు దొరకడం మాకు మహదానందంగా వుంది. మేము మీకు ఏ విధంగా సాయపడగలమో చెప్పండి అని కిమ్ కోరాడు. మీరు మా దేశ పర్యటనకు రావాలి, మీ నుండి మా ప్రజలు స్ఫూర్తి పొందాలి. అందుకే మిమ్మల్ని మా దేశానికి, అందులోనూ నెల్లూరు నగరంలో ప్రత్యేకంగా పర్యటించాలని ఆహ్వానిస్తున్నాం అని మోడీ కోరాడు. మీరు చెబితే రాకుండా వుంటానా అని చెప్పి కిమ్ ఫోన్ పెట్టేసాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో గవర్నర్ నరసింహన్, హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ, కమిషనర్ ఆలీంబాషాలు వున్నారు. అప్పుడే హెలికాప్టర్‌లు రెండొచ్చి గ్రౌండ్‌లో దిగాయి. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్, భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోడీలు సెక్యూరిటీ సిబ్బంది దిగారు. స్వాగత సత్కారాలయ్యాక ఓపెన్‌టాప్ మినీలారీలో ఎక్కి అందరూ నగర పర్యటనకు బయలుదేరారు. భూగర్భ డ్రైనేజీ కోసం గుంతలు తవ్విన రోడ్లపై వాహనం వెళుతుంటే లారీ అటూ ఇటూ ఊయల మాదిరిగా వూగసాగింది. అది చూసి కిమ్... ఇక్కడి రోడ్లు చాలా బాగున్నాయ్... వెహికల్‌లో పోతుంటే కూడా ఊయల ఊగినట్లుగా ఉంది. మా దేశంలోనూ ఇలాంటి రోడ్లు కావాలంటే ఏం చేయాలి అని అడిగాడు. వెంటనే వెంకయ్య... మీకూ హడ్కో నిధులు శాంక్షన్ చేయించి రోడ్లు పగులగొట్టిస్తే సరిపోద్దన్నాడు. అలా ట్రంకురోడ్డు, ఆత్మకూరు బస్టాండు, మినీబైపాస్ మీదుగా కిమ్‌ను తిప్పారు. మధ్యలో తవ్వేసిన రోడ్ల వద్ద కిలోల కొద్ది ధుమ్ములేచి కిమ్ ముక్కుల్లోకి, కళ్ళలోకి పోయింది. అప్పుడే చీకటి పడింది. కిమ్ మధ్య మధ్యలో చేతులను, కాళ్ళను గీరుకోసాగాడు. ఒళ్ళు ఏదో మంటగా, దురదగా వుండే సరికి తన ఒంట్లోనే ఏదో ప్రాబ్లం అనుకున్నాడు. వీళ్ళు అలా తిరుగుతూ ఎం.జి మాల్ వద్దకు వచ్చేసరికి అక్కడ స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66) వీరికి తారసపడ్డాడు. వెంకయ్య నాయుడు కిమ్‌కు వివేకాను పరిచయం చేశాడు. వివేకా అతనిని చూసి అమెరికా మీద అణుబాంబు వేస్తానంటూ తలతిక్కగా మాట్లాడే క్యాండెట్ ఇతనే కదా అని ముఖాన్నే అన్నాడు. వెంకయ్యకు ఏమి చెప్పాలో పాలుపోక అతనిని తప్పించుకుని ముందుకు కదిలారు. అలా చీకటి పడ్డాక పోలీసుగ్రౌండేకే వచ్చి హెలికాప్టర్ ఎక్కి తిరిగి బయలుదేరారు.

★★★★★

వాషింగ్టన్‌లోని అధ్యక్ష భవనం వైట్‌హౌస్. తన ఛాంబర్‌లో కూర్చుని డొనాల్డ్‌ట్రంప్ ఎన్‌డి టి.విలో వస్తున్న న్యూస్ చూస్తున్నాడు. పక్కనే తన కూతురు ఇవాంకా ట్రంప్, ఇతర మంత్రులు కూడా వున్నారు. అంతు తెలియని విషజ్వరంతో బాధపడుతున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్. తన టేబుల్ మీదున్న అణుబాంబు బటన్‌ను కాదుకదా, సర్వర్‌ను పిలిచేందుకు కాలింగ్ బెల్ కూడా కొట్టలేని విషమ పరిస్థితిలో కిమ్... ఒళ్ళంతా నొప్పులతో బాధపడుతున్న కిమ్ ఇప్పట్లో కోలుకునే పరిస్థితులు లేవని, ఇంకొన్నాళ్ళ పాటు ప్రపంచప్రజలు ప్రశాంతంగా ఉండొచ్చని శాంతికాముకులు భావిస్తున్నారు. న్యూస్ రీడర్ చదువుతున్న ఈ వార్తలు విని... అక్కడ ట్రంప్‌తో పాటు అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరిసింది. ఇవాంకా వుండి... థాంక్యూ గాడ్, ఆ కిమ్‌కు తగిన శాస్తి చేసావు అని అంది. అది విని ట్రంప్... అలా కాదమ్మా అనాల్సింది, థ్యాంక్యూ మోడీజీ... ఆ కిమ్‌కు తగిన బుద్ధి చెప్పావు అని అన్నాడు. కిమ్ ఇలా కావడానికి, మోడీకి సంబంధమేంటని ఇవాంకా అడిగింది. అప్పుడు ట్రంప్ గట్టిగా నిట్టూర్పు వదులుతూ నీకు ఫ్లాష్‌బ్యాక్ చెబుతా విను తల్లి అంటూ... ఆ కిమ్ మాటకొస్తే అమెరికా మీద అణుబాంబు వేస్తా, అణుబాంబు బటన్ ఎప్పుడూ నా టేబుల్ మీదే వుంటుందని బెదిరించసాగాడు. వాడిని ఎలా లొంగదీయాలో తెలియక ఒక ఫ్రెండ్‌గా భారత ప్రధాని నరేంద్రమోడీని ఆశ్రయించాను. ఆయన భుజబలంతో కానిది బుద్ధిబలంతో చేయాలని చెప్పాడు. కిమ్‌తో స్నేహం చేసారు. ఆయనను తమ దేశానికి అందులోనూ నెల్లూరు పర్యటనకు ఆహ్వానించారు. కిమ్ ఎంతో ఆనందంగా వెళ్ళాడు. నెల్లూరులో ముదురుదోమలు ఆయనను పీకిపెట్టాయి. ఆ దోమల దెబ్బకే ఆయన ఇప్పుడు మంచానపడి అంతు తెలియని రోగంతో అల్లాడుతున్నాడని చెప్పాడు. అది విని ఇవాంకా... డాడ్... కిమ్‌ను నెల్లూరుకు ఆహ్వానించే బదులు నెల్లూరు దోమలనే ఉత్తరకొరియా అధ్యక్షుడి భవనంలో వదిలి ఉండొచ్చు కదా అని ధర్మసందేహం వెలిబుచ్చింది. అందుకు ట్రంప్... ఇండియా వాళ్ళు... అందులోనూ నెల్లూరోళ్ళు దయార్ధహృదయులు, ధర్మాత్ములు... ఒక్కడి కోసం వందమందిని బాధపెట్టడం వారికిష్టం ఉండదు. ఆ దోమలను తెచ్చి ఉత్తరకొరియాలో వదిలితే కిమ్‌తో పాటు చాలామంది ఈ వింత రోగాలపాలవుతారు. మానవత్వానికే అది మాయని మచ్చ. అదీగాక నెల్లూరు దోమలు అక్కడి వాతావరణంలో తప్పితే ఇంకెక్కడా మనుగడ సాగించలేవు. కాబట్టే నెల్లూరుకు కిమ్‌ను ఆహ్వానించారమ్మా అని చెప్పి... థ్యాంక్యూ మోడీజీ... థ్యాంక్యూ నెల్లూరు, థ్యాంక్యూ నెల్లూరు మస్కిటోస్ అని చేతులెత్తి దండం పెట్టాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు పనిభారం, అధికారుల ఒత్తిడి ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఆకస్మిక ప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. సత్కారాలు పొందే అవకాశమున్నది. విద్యా ప్రగతి బాగుంటుంది. చిన్న చిన్న కుటుంబ సమస్యలు సర్దుకుంటాయి. ఆరోగ్యం నెమ్మదిగా కుదుట పడుతుంది. వ్యాపార విస్తరణ ఆలోచనలు తాత్కాలికంగా వదలండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూరప్రయాణాల శ్రమ, సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరించడం ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం సరిగా ఉండదు. ఆర్థికంగా కుదుటపడతారు. విద్యాప్రగతి కలదు. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. కొత్త కాంట్రాక్టులు లభించగలవు. పనులు హడావిడిగా సాగుతాయి. కోర్టు కేసులు వాయిదా పడగలవు. అధికారులకు స్థాన చలనం ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

దూర ప్రయాణాలు నిర్ణయం కాగలవు. సోదర వర్గంతో చిన్న సమస్యలుండవచ్చును. ఉద్యోగావకాశాలు లభించగలవు. కళాక్రీడా సాంకేతిక రంగాల వారికి గుర్తింపు గౌరవాలుంటాయి. అనుకున్న పనులకు ఇతరుల సహకారం లభిస్తుంది. ఆర్థిక స్థితి బాగుంటుంది. వ్యాపార విస్తరణ, కొత్త ఆదాయ అవకాశాలు దొరుకుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు విధి నిర్వహణ బాగుంటుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బిడ్డల విద్య, ఉద్యోగ విషయాలపై, పెండ్లి విషయాలపై ఆందోళన ఉంటుంది. బంధువులతోను, కుటుంబసభ్యులతోను వ్యవహారాలలో రాజీపడతారు. వృత్తి జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. చేయదలచిన ఆలోచనలు కార్యరూపంలోనికి వస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులు విధి నిర్వహణలో పబ్లిక్‌తోను, అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. విద్యార్థులకు శ్రమ, వత్తిడి అధికంగా ఉంటుంది. అనుకున్న పనులు సరిగా జరగక చికాకు, టెన్షన్ ఉంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు, కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఆర్థిక విషయాలలో జాగ్రత్తగా వ్యవహరించండి. నిర్ణయాలు సొంతంగా తీసుకొంటే మంచిది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆరోగ్యం మీకు బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడగలవు. శుభకార్యాల ప్రయత్నాలు పెరుగుతాయి. జీవిత భాగస్వామికి స్వల్ప అనారోగ్య బాధలుండవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. ఆడిటర్లు, పరిశ్రమ యజమానులకు, న్యాయవాదులకు, చిన్న పరిశ్రమలకు ఆదాయం బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 12.1.2018 నుండి

తేది. 18.1.2018 వరకు

ఈ వారము కర్కాటకంలో రాహువు, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు, తులలో కుజ గురువులు, 16తేది నుండి వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో బుధ రవి శని శుక్రులు, 13తేది మకరంలో శుక్రుడు, 14తేది నుండి మకరంలో రవి, మకరంలో కేతువు సంచరిస్తారు.

పంచాంగము

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది. ముహూర్తములు లేవు.

15 తేదీకి శూన్య మాసం సమాప్తి. ఉత్తరాయణ పుణ్యకాలము.
తేది 14 ఆదివారము భోగి పండుగ. తేది 15 సోమవారము సంక్రాంతి.
తేది 16 మంగళవారము కనుమ పండుగ.

### పుష్య మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | ఏకాదశి | రా॥గం.11.09వ॥ |
| తేది. 13 | శని | ద్వాదశి | రా॥ గం.12.50వ॥ |
| తేది. 14 | ఆది | త్రయోదశి | రా॥ గం.2.49వ॥ |
| తేది. 15 | సోమ | చతుర్దశి | రా॥ గం.4.52వ॥ |
| తేది. 16 | మంగళ | అమావాస్య | పూర్తిగ |
| తేది.17 | బుధ | అమావాస్య | ఉ॥ గం.7.10వ॥ |
| తేది.18 | గురు | పాడ్యమి | ఉ॥ గం.9.10వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సభలు సమావేశాలలో పాల్గొంటారు. శుభకార్య నిర్ణయం కాగలవు. ఉద్యోగార్థులు కొద్దికాలం వేచి ఉండాలి. బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. ఆస్తి, ఋణ వ్యవహారాలు రాజీకి వస్తాయి. ఉద్యోగులకు బాధ్యతలు అదనంగా ఉంటాయి. విద్యార్థులు బాగా శ్రమించాలి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయానికి ధీటుగా ఖర్చులుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగార్థులకు అనుకూలత బాగుంటుంది. విద్యా ప్రగతి, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులపై లాభాలుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. కొత్త పరిచయాలు జరిగి ప్రయోజనం పొందుతారు. కోర్టు కేసులు కొంత సానుకూలం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. సభలు సమావేశాలలో పాల్గొనడం, దూర ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల వివాద పరిష్కారాలు జరుగగలవు. విలువైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త. ఉద్యోగులు వత్తిళ్ళకు లొంగి ఇబ్బంది పడకండి. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. కుటుంబంలో కొద్దిపాటి భేదాభిప్రాయాలుండి సర్దుబాటు కాగలవు. ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారవర్గంతో సత్సంబంధాలుంటాయి. ఇతరుల విషయాలలో జోక్యం చేసికొనవద్దు. దూర ప్రయాణాలు అవసరం ఉంటుంది. సభలు సన్మానాలలో పాల్గొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం జాగ్రత్త. అవసరాలకు ఇతరులను బట్టి సర్దుకొని పోతూ పనులు జరుపకొనవలసి ఉంటుంది. చిరు వ్యాపారులు, వృత్తి జీవనం కలవారికి ఆర్థికస్థితి బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. మాటల తీవ్రత, తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు ఉండగలవు. కుటుంబంలో సమస్యలుంటే చర్చించి పరిష్కరించగలరు. ఆర్థిక ఇబ్బంది లేకున్నను సంతృప్తి ఉండదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఒత్తిడులుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలందు ఫలితం లభించగలదు. దూర ప్రయాణాలుండుట, సత్కారాలు పొందడం, సభలు సమావేశాలలో పాల్గొనడం, విద్యార్థులకు విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. అనుకున్న పనులు సక్రమంగా జరుపకొనగలిగిన సమర్థత ఉంటుంది. ఆర్థిక స్థితి బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి.

# నేదురుమల్లి రామ్‌కుమార్ జన్మదిన వేడుకలు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బాలసుధాకర్

నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి టి. బాలసుధాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 8న పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నెల్లూరు దర్గామిట్టలో ఉన్న ఉన్న సాల్వేషన్ ఆర్మీచర్చిలో రామ్‌కుమార్‌రెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుధాకర్ మాట్లాడుతూ, ప్రజలకు నేదురుమల్లి ఫౌండేషన్ అందజేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. నిరుపేదలను ఆదుకుంటున్న నేదురుమల్లి కుటుంబసభ్యుల సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలసుధాకర్‌తో పాటు, సంఘ సభ్యులు జి. యోషా, విజయబాబు, కిషోర్, పెరుమాళ్, మేరి గ్రేస్, యేసు దయమ్మ, విజయప్రసాద్, భారతి, సుమప్రియ, సుప్రియ, దయా సుస్మిత, షైనీ, స్మైలీ, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ హెల్పేజ్ వార్షికోత్సవం




దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీకంటి రామ్మోహన్ దంపతులు

రోటరీ హెల్పేజ్ 13వ వార్షికోత్సవం గూడూరు రోటరీ భవన్‌లో ఈ నెల 10వ తేదీ జరిగింది. ఈ సందర్భంగా 60మంది వృద్ధులకు ఫలసరుకులు, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీరలు, పంచెలు, స్వీట్లు, ఫలహారాలు రొటేరియన్, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి పి.ఎస్.రాజ్యలక్ష్మిల చేతుల మీదుగా అందజేశారు. వీటికి దాతలుగా రొటేరియన్ సి.రామకృష్ణ స్వరూప్, రొటేరియన్ దయాకర్‌రెడ్డిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు దంపతులను రోటరి హెల్పేజ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణ రాజు, హెల్పేజ్ కన్వీనర్ జానకిరామిరెడ్డి, రొటేరియన్లు కె.మునిగిరీష్, మయూరి శ్యాం యాదవ్, ఎ.ఎస్.ఎన్.రాజా, కె.సుందరరామిరెడ్డి, హరిప్రసాద్, నాగసూరి గోపాలరావు, నాగేంద్రప్రసాద్, దయాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేసీస్ సంక్రాంతి సంబరాలు




సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న జేసీస్ సభ్యులు

నెల్లూరు టౌన్ జేసీఐ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన గొలగమూడిలోని ఫన్‌పార్క్ నందు జేసీస్ సభ్యులు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేసి, భోగిపళ్ళు పోసారు. పొంగలిని పొంగించి ఆటపాటలతో ముగ్గుల పోటీలతో, గాలిపటాలు, గంగిరెద్దుల ఆటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జేసీస్ అధ్యక్షులు కొత్తూరు సాయి, సంయుక్త, శరణ్‌కుమార్, ఉమారాణి, సురేష్, జనార్ధన్, సత్యం, మధు పాల్గొన్నారు.




# కావలి అభివృద్ధికి సహకరిస్తా...

## - మంత్రి నారా లోకేష్



ఆత్మగౌరవదీక్ష ర్యాలీలో పాల్గొన్న మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, సోమిరెడ్డి

కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట గురుకుల బాలికల పాఠశాలకు అన్ని మౌలిక వసతులు కలిగించేందుకు కోటీ 30 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతిరాజ్, ఐ.టి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ నెల 8న తుమ్మలపెంట బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నియోజకవర్గానికి కావాల్సిన నిధులను ఏర్పాటుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామన్నారు. తమ తాతగారైన ఎన్టీఆర్ హయాంలో ఈ గురుకుల పాఠశాలను ప్రారంభించడం జరిగిందని, ఎన్టీఆర్ మనవడిగా సుమారు 30 ఏళ్ళ తర్వాత తాను ఈ ప్రాంతంలో అడుగుపెట్టడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో అధికారుల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేసినా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజల ముంగిళ్ళలోకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని, రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ ప్రజల కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిద్రాహారాలను, వయసును సైతం లెక్కచేయకుండా ఒక యువకునిలాగా అహరహం ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారని ఆయన అన్నారు. దేశంలోనే మన రాష్ట్రాన్ని నెంబర్ 1గా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని, ఇదంతా చిన్నారుల భవిష్యత్ కోసమేనని అన్నారు. తెలుగుదేశం పాలనలో రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, పేదలందరికీ ఇళ్ళు, పింఛన్ పెంచడం వంటి పథకాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టి వాటిని అమలుచేస్తున్నారని మంత్రి లోకేష్ వివరించారు. ప్రత్యేకించి వ్యవసాయానికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతులకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని భారీమెజార్టీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా అందరికీ విజ్ఞప్తి చేశారు. బీద మస్తాన్‌రావు ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా, ఓడిపోయినా ఈ నియోజకవర్గ అభివృద్ధికోసం ఎంతో కృషి చేస్తున్నారంటూ బీద మస్తాన్‌రావును మంత్రి లోకేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డా.పి.నారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు-ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యుడు, కావలి మాజీ ఎమ్మెల్యే బీదా మస్తాన్‌రావు, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కర్రసాములో రెయిన్‌బో విద్యార్థుల ప్రతిభ




కర్రసాములోనూ సింహపురి చిన్నారులు తమ ప్రతిభను చాటుకుంటూ జిల్లా పేరును మార్మోగిస్తున్నారు. ఈ నెల 3 నుంచి 9 వ తేది వరకు న్యూఢిల్లీలోని వికాస్ పురి స్టేడియంలో జరిగిన 63వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2017-18లో ఈ క్రీడ అందరినీ ఆకట్టుకుంది. భారత ప్రాచీన యుద్ధక్రీడగా గుర్తింపు పొందిన కర్రసాములో అండర్-14 బాలబాలికల విభాగంలో నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెంలోని రెయిన్‌బో సిబిఎస్‌ఇ పాఠశాల విద్యార్థులు పాల్గొని కర్రసాములో తమ సత్తా నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో 16 రాష్ట్రాల నుంచి పోటీదారులు పాల్గొనగా మన రాష్ట్రం నుంచి 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మన రాష్ట్రానికి మూడు కాంస్య పతకాలు లభించగా, అందులో ఇద్దరు విద్యార్థులు నెల్లూరుజిల్లాకు చెందిన రెయిన్‌బో విద్యార్థులు కావడం విశేషం. సింగిల్ స్టిక్ బాలుర విభాగంలో సంజయ్ కృష్ణ, డబుల్‌స్టిక్ బాలికల విభాగంలో ఎం.లీలామహాలక్ష్మి కాంస్యపతకాలు సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం జాతీయ స్థాయిలో ప్రతిభతో పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ శ్రీనివాసులును అభినందించారు. రెయిన్‌బో పాఠశాల ప్రిన్సిపాల్ రామగిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు బ్రాండ్ ఏది?

(5వ పేజీ తరువాయి)

దగదర్తి ఎయిర్‌పోర్టుకు కూడా ఇంతవరకు శంకుస్థాపన జరగలేదు. కృష్ణ పట్నంలో గాని మిగిలిన సెజ్‌లలో గాని కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు. విభజన చట్టంలో చెప్పిన దుగరాజపట్నం పోర్టుకు కూడా దిక్కులేదు. నెల్లూరుజిల్లాలో పారిశ్రామికంగా వై.యస్. ఉన్నప్పుడు ఏదైతే జరిగిందో... ఇప్పటికీ అదే వుంది. ఈ నాలుగేళ్లుగా చంద్రబాబు జిల్లా ప్రజలకు మాటలు చెప్పడం తప్పించి చేతుల ద్వారా చూపించిందేమీ లేదు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అన్నదానం




స్నేహం, ఆరోగ్యం, సేవ అనే సిద్ధాంతాలతో పనిచేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీన అసోసియేషన్ సభ్యులైన నలుబోలు బలరామయ్యనాయుడు తండ్రి స్వర్గీయ నలుబోలు మల్లయ్యనాయుడు 7వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వినుకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఏడేళ్ళుగా నలుబోలు బలరామయ్యనాయుడు తన తండ్రి వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా సమన్వయకర్త యం.వి.సుబ్బారెడ్డి, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.వి.కృష్ణయ్య, కోశాధికారి పిట్ల రాజారావు, సంయుక్త కార్యదర్శి ఎన్.సాయిసుబ్బారావు, కార్యవర్గసభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, లక్కాకుల శ్రీనివాసులు, ఎ.శేషయ్య, బి.సూర్యనారాయణ, తుమ్మల శ్రీనివాసరావు, హరిరావు పాల్గొన్నారు.



# ముగిసిన ప్రజాబాట

## 'మన ఎమ్మెల్యే - మన ఇంటికి' అంటూ 105రోజులు ఇల్లిల్లూ తిరిగిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

'మన ఎమ్మెల్యే మన ఇంటికి' అంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించిన ప్రజాబాట కార్యక్రమం ఈ నెల 12వ తేదీతో ముగిసింది. సెప్టెంబర్ 30వ తేదీ విజయదశమి పర్వదినాన నియోజకవర్గానికి ఈశాన్యం ప్రాంతమైన కోడూరుపాడు నుండి ప్రజాబాటను ప్రారంభించారు. ఆరోజు నుండి ఈ నెల 12వ తేదీ వరకు తన ఇంటి ముఖం చూడలేదు. 105రోజుల పాటు ప్రజల మధ్యే నీళ్ళు, నిద్ర, తిండి అంతా కూడా! నియోజకవర్గంలోని అన్ని రూరల్ గ్రామాలతో పాటు రూరల్‌లోకి వచ్చే కార్పొరేషన్ డివిజన్‌లలోనూ పర్యటించారు. ప్రతి గడప తొక్కారు. ప్రతి ఇంటి తలుపుతట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారి సమస్యలపై అధికారులతో మాట్లాడారు. 105రోజుల పాటు ప్రజల మధ్యనే గడిపారు. 12వ తేదీన రామలింగాపురంలోని ముత్యాలపాలెంలో పర్యటించారు. అక్కడే ప్రజాబాట ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

# సమన్వయ లోపం... వైకాపాకు శాపం!

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి చాలా కారణాలున్నాయి. మోడీ ఇమేజ్, పవన్‌కళ్యాణ్ మద్దతు, ఋణమాఫీ వాగ్దానం, కాంగ్రెస్ నేతలు రావడం, డబ్బు పంపిణీ, జగన్‌పైన మతపరమైన ముద్ర... తెలుగుదేశం గెలుపులో ఇవన్నీ ఒకెత్తయితే, పార్టీ తరపున ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఇంకో ఎత్తు. 2014 ఎన్నికల తర్వాత తనలోని చాలా లోపాలను జగన్ సరిదిద్దుకుంటూ వస్తున్నాడు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలను ఆకట్టుకునే దిశగా హామీలు గుప్పిస్తున్నాడు. తనపై వున్న మతముద్రను చెరిపేసుకోవడానికి, దాని మూలంగా దూరమైన కొన్ని వర్గాలను దగ్గర చేసుకోవడానికి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ఆచరిస్తూ గౌరవిస్తున్నాడు. గతంలో తన తండ్రి వైయస్‌ను వెన్నంటి నడిచిన కాంగ్రెస్ సీనియర్ నాయకులను సంప్రదించి పార్టీలో చేర్చుకోవాలనే ఆలోచనలో వున్నాడు.

రేపు ఎలక్షన్‌ను ఎదుర్కోవడానికి జగన్ అన్నీ సిద్ధం చేసుకున్నాడు. అయితే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ టీమ్ సిద్ధం కావాల్సి వుంది. 2014 ఎన్నికల్లో వైకాపాకు పెద్ద లోటు ఇదే! తెలుగుదేశం తరపున చంద్రబాబు ఒక్కడే ఎలక్షన్ నడిపించలేదు. ఆయన తరపున పి.నారాయణ, సుజనాచౌదరి, సీఎం రమేష్, కంభంపాటి రామ్మోహన్‌రావు... ఇలా ఎందరో సీనియర్‌లు జిల్లాలవారీగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తూ ఏ జిల్లాలో ఏ నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉందో తెలుసుకుంటూ, ప్రతిరోజూ, ప్రతి గంట అభ్యర్థులతో మాట్లాడుతూ వాళ్ళ అవసరాలు తెలుసుకుంటూ వారికి కావాల్సిందానిని వెంటనే సమకూరుస్తూ ఎలక్షన్ నడిపించారు. కాని, ఇక్కడ వైకాపాలో చూస్తే పోటీ చేసిన అభ్యర్థులను పట్టించుకున్న నాథుడు లేడు. అభ్యర్థులతో మాట్లాడితే జగనే మాట్లాడాలి. పులివెందుల అసెంబ్లీ నుండి ఆయనా పోటీ చేసుండే... ఇక రాష్ట్రమంతటా ప్రచారం చేయాల్సివుండే... ఇక అభ్యర్థుల మంచి చెడ్డలు చూసుకునే తీరిక ఆయనకెక్కడిది. పార్టీలో వున్నోళ్లలో సీనియర్‌లు, జగన్‌కు ముఖ్యమనుకున్న వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి లాంటోళ్ళు ఎలక్షన్‌లలో పోటీకి దిగారు. దీంతో పార్టీ ఆఫీసులో అభ్యర్థులకు సమాధానం చెప్పే వాళ్ళు గాని, వాళ్ళ సమస్యలు వినేవాళ్ళు గాని లేకుండాపోయారు. రేపు ఎన్నికల్లో ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలి. సీనియర్‌లను పోటీలో దించకుండా ఎలక్షన్ నిర్వహించే బాధ్యతను వాళ్ళకు అప్పగించాలి. ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గం కీలకం కానుంది. ప్రతిచోటా గట్టిపోటీ వుంటుంది. కాబట్టి అందరు అభ్యర్థులతో సమన్వయం చేసుకోగల ఎలక్షన్ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడంపై జగన్ దృష్టి సారించాల్సివుంది.










# ఓను... వాళ్ళ కాలాన్ని వెనక్కి తిప్పారు...!

## స్నేహమేరా జీవితం.....



నిలబడిన వారు: పి.కృష్ణయ్య, సి.శ్రీరామమూర్తి, పి.విజయరామిరెడ్డి, రెండవ వరుసలో: ఎండి.జుబైర్, సుబ్బరామిరెడ్డి, బి.నిరంజన్‌రెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, పురుషోత్తం, ఎ.వరదారెడ్డి, కుర్చీలలో కూర్చున్నవారు: వి.కృష్ణరాజేంద్రరావు, డి.రాధాకృష్ణయ్య, బి.సుబ్బారెడ్డి(కెమిస్ట్రీ లెక్చరర్) ఆర్.సుబ్బారెడ్డి(ప్రిన్సిపాల్), ఎం.సుబ్బారెడ్డి(జువాలజీ లెక్చరర్), పి.జానకిరామిరెడ్డి, కె.వి.రత్నం నేలపై కూర్చున్నవారు: సుబ్బుసుందరి, అమ్మణమ్మ, శ్రీమతి, మైథిలి (ఫిబ్రవరి 1966)

స్నేహానికున్న శక్తి ప్రపంచాన్ని సైతం ఒక్కటిగా చేస్తుంది. స్నేహానికున్న బలం కాలాన్నైనా వెనక్కి తిప్పుతుంది. అవును నిజమే... స్నేహం కాలాన్ని వెనక్కి తీసుకెళ్ళింది. ఒకరోజు రెండురోజులు కాదు... ఒక నెల రెండు నెలలు కాదు... ఒక సంవత్సరం రెండు సంవత్సరాలు కాదు... ఏకంగా 52 సంవత్సరాల వెనక్కు తీసుకెళ్ళిపోయింది.

తమ దగ్గర చదువుకున్న విద్యార్థులందరూ ఓ చోట చేరడం తమ గురువులను సత్కరించుకోవడం తరచూ జరిగే విషయమే. కాని, ఇక్కడ అలా జరగలేదు. కొన్ని లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులను భావి ప్రపంచానికి అందించిన రత్నం అయ్యోరు, ఆయనే విద్యార్థిగా మారిపోయాడు. తనతో పాటు 1963 నుండి 66వరకూ వి.ఆర్. కళాశాలలో బియస్సీ సి.బి.జడ్ గ్రూపులో చదువుకున్న విద్యార్థుల కోసం అన్వేషణ ప్రారంభించాడు. 1966లో తాను తీసుకున్న ఫోటో ఆధారంగా ఒక్కొక్కరి వివరాలు సేకరించడం మొదలుపెట్టాడు. మొత్తం 21మందిలో కొందరి చిరునామా దొరకలేదు. మరికొందరు ఈ లోకాన్ని విడిచిపోయారు, ఇంకొందరు సుదూరప్రాంతాల్లో వేరే దేశాలలో వున్నారు. కానీ, రత్నం మాస్టారు పట్టువదల్లేదు. ఎలాగైనా వీళ్ళని కలవాలనే తపనతో ప్రయత్నాన్ని కొనసాగించాడు. చివరికి ఎక్కడెక్కడి నుండో 9మందిని ఓ చోట చేర్చగలిగాడు. జనవరి 6, 7తేదీలలో తనతో పాటు మొత్తం 10మందీ నెల్లూరులోని అతిథి హోటల్‌కి చేరారు. రెండురోజుల పాటు ఇక్కడే గడిపారు. అయితే వీళ్లు కలిసిన రోజే ఓ కండిషన్ పెట్టుకున్నారు. ఇక్కడ మనందరం మన స్థాయిని మర్చిపోదాం, మన ప్రస్తుత స్థితిని వదిలేద్దాం, 1963-66 మధ్యకాలంలో ఎలా వున్నామో అలాగే వుందాం అని ప్రతిజ్ఞ చేసుకున్నారు.

బాహ్య ప్రపంచాన్ని మర్చిపోయారు, బంధుబాంధవ్యాల్ని విడిచిపెట్టారు, బరువు బాధ్యతలకు విశ్రాంతినిచ్చారు. అన్నీ మర్చిపోయి 53ఏళ్ళ వెనక్కి కాలాన్ని తిప్పేశారు. ఆనాటి నవ్వులు, కాలేజీలో చేసిన చిలిపి పనులు, లెక్చరర్లతో వేసిన ఛలోక్తులు, ఆత్మీయులతో నడిపిన ప్రేమ సందేశాలు... ఇలా ఎన్నో పాత విషయాలు, ఎన్నో మధుర జ్ఞాపకాలు, ఎన్నెన్నో తీపి క్షణాలను తలుచుకుంటూ తమ వయసును మరచి ఊసులు చెప్పుకున్నారు.

కుర్రాళ్ళులాగా కాలేజీ రోజుల్లోకి వెళ్ళిపోయారు. కపటం లేకుండా మాట్లాడుకున్నారు. రత్నం మాష్టారి సహవిద్యార్థులైన ఎం.డి.జుబైర్, ఎ.వరదారెడ్డి, జయరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, కృష్ణ రాజేంద్రరావు, శ్రీరామ్మూర్తి, పోతు కృష్ణయ్య, దూడల రాధాకృష్ణయ్యలు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొని పాత జ్ఞాపకాలతో, పాత స్నేహితులతో కలిసి కాలాన్ని మరచిపోయారు.

వీరితో పాటు 1963లో కొంతకాలం చదివిన డాక్టర్ ఏ.వి. సుబ్రహ్మణ్యం, డాక్టర్ హరిశ్చంద్రారెడ్డితో పాటు వీరితో కలిసి చదవకపోయినా ఆ రోజు నుండి ఈరోజు వరకు వీరితో స్నేహ బాంధవ్యాన్ని కొనసాగిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పసుపులేటి రామ్మూర్తి, నలుబోలు బలరామయ్యలు కూడా వీరిని కలిసి తమ మధురస్మృతులు పంచుకున్నారు.



డా॥ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఎన్.బలరామయ్యనాయుడు, పి.రామమూర్తి, డా॥ హరిశ్చంద్రారెడ్డి

## స్నేహమేరా శాశ్వతం.....



పైవరుసలో వున్నవారు: వి.కృష్ణరాజేంద్రరావు, పి.జానకిరామిరెడ్డి, డి.రాధాకృష్ణయ్య, పి.నిరంజన్‌రెడ్డి
క్రింది వరుసలో వున్నవారు: సి.శ్రీరామమూర్తి, ఏ.వరదారెడ్డి, కె.వి.రత్నం, ఎండి.జుబైర్, పి.విజయరామిరెడ్డి, పి.కృష్ణయ్య (06.01.2018)

ఎప్పుడో 1963లో కలిసి చదువుకున్నోళ్ళు... ఎవరెక్కడుంటారో తెలియని పరిస్థితి... అసలు అప్పటి మనుషులను గుర్తుపెట్టుకోవడమే గగనం. అలాంటిది 52ఏళ్ల క్రితం తనతో కలిసి చదివిన స్నేహితులను గుర్తుపెట్టుకుని వారందరినీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చిన రత్నం అయ్యోరుకి నిజంగా హేట్సాఫ్ చెప్పాలి.

7 పదులు పైబడిన తన పూర్వ మిత్రులందరికీ ఆయన కొత్త ఆశలను రేకెత్తించాడు. అందరినీ 50సంవత్సరాలు వెనక్కు తీసుకెళ్ళి వారి జీవితాలలో మరో 30ఏళ్ళకు సరిపడా ఎనర్జీని నింపాడు. తాము ఇంకా కుర్రవాళ్ళమే అనే భావన వాళ్ళలో కలిగేలా వారి ఆలోచనా సరళిని మార్చేశాడు. ఆయన సేవలో, విద్యలో, క్రమశిక్షణలో, అంకిత భావంలోనే కాదు స్నేహ బాంధవ్యంలో కూడా 'రత్నమే'.

*ఈ అపూర్వ కలయిక పట్ల అందరూ ఆనందభరితులయ్యారు. భావోద్వేగాలకు లోనయ్యారు. తమ గుండె లోతుల్లో నుండి వచ్చిన సంతోషాన్ని 'లాయర్'తో పంచుకున్నారు.*

**కె.వి.రత్నం:** ఒక విద్యావేత్తగా జీవితంలో నేను ఎన్నో సాధించి ఉండొచ్చు. ఎంతో మంది భవిష్యత్‌ను తీర్చిదిద్దివుండొచ్చు. విద్యాసంస్థల అధినేతను కావచ్చు... నా జీవిత పయనంలో అవన్నీ ఒక కోణం. కాని నా వ్యక్తిగత జీవితంలో ఇదొక మధురానుభూతి. నా డిగ్రీ బ్యాచ్ విద్యార్థులను 52ఏళ్ల తర్వాత నేను మళ్ళీ కలుసుకోవడం నాకు లభించిన వరం. నేను చేసిన ఎన్నో శుభకార్యక్రమాల్లో ఇది ఎప్పటికీ మరపురాని జ్ఞాపకం. నేను పిలవగానే వచ్చిన మిత్రులందరికీ హృదయపూర్వక అభివందనం.

**ఎం.డి.జుబైర్:** ఇన్నేళ్ల తర్వాత మా డిగ్రీ స్నేహితులందరినీ ఒక్క చోట చూసేసరికి చాలా భావోద్వేగం చెందాను. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. 72ఏళ్ల వయసులో వున్న మేం 22ఏళ్ల వయసులోకి వెళ్లాం. పాతమిత్రులం సరదాగా గడిపాం. ఈ ఆత్మీయకలయికకు కారణమైన నా ఫ్రెండ్ రత్నంకు ఎంతైనా కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

**ఎ.వరదారెడ్డి:** ఈ కలయిక నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలగజేసింది. ఇది ఊహకే అందని సంఘటన. కె.వి.రత్నం చొరవ తీసుకోబట్టే నా డిగ్రీ స్నేహితులందరినీ తిరిగి ఒకచోట కలుసుకోగలిగాను. ఆ సంతోష క్షణాలను జీవితంలో మరచిపోలేను.

**విజయరామిరెడ్డి:** ఇది కలయా, నిజమా అని ఆశ్చర్య పరిచేంత అద్భుత కార్యక్రమమిది. ఆ రెండు రోజులు నా ఫ్రెండ్స్‌తో సరదాగా గడిపాను. ఇంటికొచ్చాక కూడా ఆ జ్ఞాపకాలు నా మనసు నుండి వెళ్లలేదు. నా మిత్రులు ఇప్పటికీ నా కళ్ళల్లోనే మెదులుతున్నారు. అందరం ఒక చోట కలవడం, మాట్లాడు కోవడం, అనుభవాలు పంచుకోవడం... నిజంగా కొందరికే లభించే అదృష్టం. థ్యాంక్స్ టు రత్నం.

**నిరంజన్‌రెడ్డి:** 6వ తేదీ అందరం కలిసిన సమయంలో నేను అనుభవించిన సంతోషానికి కొలమానం లేదు. 7వ తేదీ రాత్రి అందరం తిరిగి వెళ్ళే సమయంలో నేను పడ్డ బాధకు కూడా కొలమానం లేదు. అంత బాధేసింది. ప్రతిరోజూ ఇలానే వుంటే బాగుండనిపించింది. ఈ ఆత్మీయ కలయికలో మా అధ్యాపకులను గుర్తు చేసుకున్నాం. మా విఆర్ కళాశాల మేనేజర్ తుంగా రమణారెడ్డి గారితో మాకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నాం. ఆయన నాకు గాడ్‌ఫాదర్ లాంటివాడు. ఆయనకు పిల్లలు లేరు. విద్యార్థులనే తన పిల్లలుగా ప్రేమించేంత గొప్ప వ్యక్తి ఆయన. మమ్మల్ని 53ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిన రత్నం కృషి అభినందనీయం.

**జానకిరామిరెడ్డి:** నా పూర్వమిత్రులను ఇలా కలుస్తానని కలలో కూడా ఊహించలేదు. మాటల్లో చెప్పలేనంత ఆనందమేసింది. ఈ కలయిక ద్వారా మాకు పదేళ్ళ ఆయుష్షు పెరిగినంత ఉత్సాహమొచ్చింది.

**వేగూరు కృష్ణరాజేంద్రరావు:** మేమంతా మళ్ళీ కాలేజీ రోజుల్లోకి వెళ్ళిపోయాం. ఇళ్లకు వెళ్ళాకా కూడా నా మిత్రులతో గడిపిన క్షణాలే గుర్తుకు రాసాగాయి. మాటల్లో చెప్పలేని అనుభూతి ఇది. నా ఫ్రెండ్ రత్నం చేసిన కృషికి ఫలితం ఈ అపూర్వ సమ్మేళనం.

**పోతు కృష్ణయ్య:** వయస్సు పైనబడింది, జ్ఞాపకాలు మరుగునపడ్డాయి. ఇలాంటి తరుణంలో 52ఏళ్ల క్రితం కలిసి చదివిన వారందరినీ ఒకచోట చేర్చడమంటే మాటలు కాదు. కాని, ఆ అద్భుతాన్ని నిజం చేసాడు రత్నం. మానవ సంబంధాలు బలపడడానికి ఇదొక మంచి ప్రయత్నం.

**డాక్టర్ దూడల రాధాకృష్ణయ్య:** మనుషులకెప్పుడూ విద్యార్థి దశ జ్ఞాపకాలు తీపిగానే వుంటాయి. ఆ జ్ఞాపకాలను మళ్ళీ గుర్తుచేసుకునే అవకాశం కల్పించాడు రత్నం. నా బ్యాచ్‌మేట్స్‌ను ఒకేసారి ఒకేచోట చూసేసరికి చెప్పలేనంత ఆనందం వేసింది. ఈ మధురజ్ఞాపకాలు నా గుండెలో పదిలంగా నిలిచిపోతాయి.

**శ్రీరామ్మూర్తి:** బంధాలకు ప్రేరణనిచ్చే కార్యక్రమం ఇది. స్నేహితుల మధ్య వలయాలుండవు, అంతరాలుండవు. కేవలం ప్రేమమాత్రమే ఉంటుందని ఈ ఆత్మీయ కలయిక ద్వారా చాటి చెప్పాం. తన స్నేహితులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చిన రత్నం ధన్యుడు.

**డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం:** చిన్ననాటి స్నేహితులను ఇన్నేళ్ళ తర్వాత కలుసుకోవడం చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ కలయిక ద్వారా నేను వారి సేవలను రెడ్‌క్రాస్‌కు కూడా ఉపయోగించుకోవాలనుకుంటున్నాను. రెడ్‌క్రాస్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలలో ఇక నుండి నా మిత్రులను కూడా భాగస్వాములను చేస్తాను.

**డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి:** ఎక్సలెంట్ ప్రోగ్రామ్... 55ఏళ్ళ క్రితం కలిసి చదువుకున్న స్నేహితులను మళ్ళీ ఇప్పుడు కలుసుకోవడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని కలిగించింది. మా మిత్రుల కలయికతో నేను బిఎస్సీ మొదటి సంవత్సరం చదివిన నాటి రోజులను గుర్తు చేసుకున్నాం.

**పసుపులేటి రామ్మూర్తి:** నేను, బలరామయ్య వాళ్ళతో కలిసి చదవకపోయినా, అప్పట్లో తరచూ కలుసుకుంటుండేవాళ్ళం. అప్పటికంటే నిన్న కలిసిన క్షణాలే ఎంతో ఆనందంగా వున్నాయి. వాళ్ళు కలుసుకుంటున్న సందర్భంలో మమ్మల్ని కూడా పిలిచి మాకు మధురానుభూతిని మిగిల్చినందుకు వాళ్ళందరికి మేము ఋణపడి ఉంటాము.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com